


జాబితాలో నలుపురంగులో గుర్తు పట్టలేని ఫొటోలు

## బ్లాక్ అండ్ వైట్ ఓటర్ల జాబితా

- ముదినేపల్లి ఓటర్ల లిస్టులో చిత్ర విచిత్రాలు
- నలుపు-తెలుపు రంగులతో ఓటర్ల ఫొటోలు



తెలుపు రంగులో..

ముదినేపల్లి, జనవరి 27 : ఓటర్ల తుది ముసాయిదా జాబితాలో ముదినేపల్లికి చెందిన పలువురు ఓటర్ల రూపురేఖలే మారిపోయాయి. జాబితాలో పేర్లు బాగానే ఉన్నా ఫొటోలు పోలికలు లేకుండా పోయాయి. ఒకరిద్దరు అయితే ఏదో పొరపాటు జరిగిందని అనుకోవచ్చు. పెద్ద సంఖ్యలోనే ఓటర్ల ఫొటోలు గుర్తించేం దుకు వీలు లేకుండా ఉన్నాయి. ముఖాలు తెలుపు, నలుపు రంగుల్లో కనిపించడం లేదు. ఓటర్లే పేరు చూసుకుని ఫొటో ఎవరిదో తెలుసుకోలేకపోతున్నారు. గ్రామంలోని 56, 57 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని జాబితాలో షేక్ దౌలత్‌బీ ఓటరు సంఖ్య నెంబరు-618, షహనాజ్- 810, సిద్దాబత్తుల జ్యోతి-804, షాజహన్- 813, నజీమ్ ఉన్నీసా-523, జరుగుళ్ల వెంకట కుమారి-520, మీసాల సరస్వతి-511, కనకదుర్గ మహాలక్ష్మి నెంబరు-709 ఫొటోలు తెలుపు రంగులో ఉన్నాయి. నాగళ్ల మల్లిఖార్జునరావు-907 , నీరుకొండ మంజూషా -908, కోడూరు జయదుర్గాదేవి-798 ఫొటోలు నలుపు రంగులో ఉన్నాయి. ఇలా ముదినేపల్లి ఓటరు లిస్టు బ్లాక్ అండ్ వైట్ రంగులతో నిండి ఉంది. దీనిపై తహసీల్దార్ కె.శ్రీనివాస్ స్పందిస్తూ ఓటర్ల జాబితాలో తమ ఫొటోలు అస్పష్టంగా ఉంటే ఓటర్లు ప్రస్తుత ఫొటోతో ఫారం-8సీ ద్వారా బీఎల్‌వో వద్ద నమోదు చేసుకోవాలని తెలిపారు.

## రేపటి వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు తత్కాల్ గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 27 : మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్, ఒకేషనల్, ప్రైవేటు విద్యార్థులు పరీక్ష ఫీజును తత్కాల్ పథకం కింద రూ.3వేలు పెనాల్టీతో కలిపి చెల్లించేందుకు తుదిగడువు ఈనెల 29 సాయంత్రం 5గంటల వరకు ఉందని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజును సంబంధిత కళాశాల లాగిన్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలి. ఏవైనా సందేహాలుంటే ఏలూరులోని డీవీఈవో కార్యాలయంలో లేదా కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230197లో సంప్రదించాలి.

# కుల గణనలో ఆస్తులపై ఆరా



ఏలూరులో కుల గణన సర్వేలో వివరాలు సేకరిస్తున్న వలంటీర్లు

నిన్నటి వరకు ఓటర్ల జాబితా సర్వే పేరుతో ఇళ్ల చుట్టూ తిరిగిన వలంటీర్లు ఇవాళ కుల గణన పేరిట గస్తీ కాస్తున్నారు. వలంటీర్లతో ఎన్నికల సర్వే చేయించడాన్ని న్యాయస్థానాలు ఆక్షేపించినా ఆగని ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా కులగణనను సర్వే చేయిస్తోంది. ఇంటింటికీ ఫోన్లు చేసి మరీ వివరాలు సేకరిస్తోంది. ఏలూరు జిల్లాలో కుల గణన సర్వే పేరుతో కోళ్లు ఎన్ని ఉన్నాయి? గేదెలు ఎన్ని? ఆస్తి ఎంత? ఎన్ని గజాలు, ఎకరాల్లో ఉంది? అంటూ ఆస్తితో పాటు వ్యక్తిగత వివరాలు సైతం లాగేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో ఓడిపోయినా ప్రతీ మనిషి కదలిక పైనా ఆ పార్టీ నాయకులు నిఘా పెట్టేందుకు వీలుగా వాతావరణం 'సిద్ధం' చేసుకుంటున్నారని స్పష్టమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే కుల గణన పేరుతో సామాన్యుడి నెత్తిన సీసీ కెమెరాలు పెట్టి మరీ ఓటర్ల పర్సనల్ డేటా మొత్తాన్ని గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం చేస్తోంది.

## వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్న వలంటీర్లు

- సర్వేలో అంతా తామై వ్యవహరిస్తున్న వైనం
- పేరుకే వెంట సచివాలయ ఉద్యోగులు
- కోళ్లు, గేదెల వివరాలు అడుగుతున్న సిబ్బంది
- గట్టిగా నిలదీస్తే సమాధానం దాటవేత
- ఫోన్ల ద్వారా లైన్‌లోకి వస్తూ ప్రశ్నల పరంపర
- సామాన్యుడి నెత్తిన నిఘా కన్ను



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల నిమిత్తం కుల గణన సర్వే చేస్తున్నామని ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్‌తో పాటు సంబంధిత స్థానిక సంస్థల అధికారులు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ఇటీవలే ప్రకటించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే అనేది ప్రభుత్వం అధీనంలో జరుగుతాయని ఆ ప్రకటనల సారాంశంగా స్పష్టమవుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పేరుకు సచివాలయ ఉద్యోగులను పక్కన పెట్టుకుని యావత్ సర్వే వ్యవహారాన్ని గ్రామ, వార్డు వలంటీర్లే కానిచ్చేస్తున్నారు. అదేమంటే ఉద్యోగుల కంటే వలంటీర్లకే ప్రతీ ఇంటి గురించి తెలుస్తుందంటున్నారు. మరి సర్వే నమోదులో సచివాలయ ఉద్యోగుల వేలిముద్రలతో పాటు వలంటీర్ల వేలిముద్రలు స్కాన్ చేస్తేనే ఎందుకు సర్వర్ పని చేస్తుందనే అంశంపై అధికారులు మెదపడంలేదు. కేవలం ఈ ప్రభుత్వం సొంత సైన్యంగా ఏర్పాటు చేసుకుని, ఏ ప్రభుత్వ శాఖకు చెందని వలంటీర్లను ఇలా కుల గణన సర్వేను చేయించడంపై జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కుల గణన అంటే సామాజిక వర్గ వివరాలు మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత, ఆస్తి వివరాలను సైతం అడిగి తీసుకోవడంలో అంతరార్థమేంటని నిలదీస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే, ఓటర్ల ఇళ్లల్లో ఎవరైనా మరణిస్తే ఆ వ్యక్తి వివరాల సేకరణకు ఈ సర్వే ముందస్తుగా ఉపయోగపడుతుందనే కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. చనిపోయిన వారి వివరాలకు ఆస్తి వివరాలతో ఏం సంబంధం అని అడిగే ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానాల్లేవు.

### ఫోన్లే ఆయుధాలు

జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాలు పనిచేస్తుండగా, అందులో 4,926 మంది సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆ ఉద్యోగులను ఆటలో అరటి పండు తీరున సర్వేలో పనిచేయిస్తున్న ఉన్నతాధికారులు, పూర్తి సేకరణను వలంటీర్లతోనే చేయిస్తుండడం గమనార్హం.

### ఇళ్లకు వెళ్లకుండానే..

ప్రారంభంలో ఇళ్లకు వెళ్లి మరీ కుల గణన అనేది తమ వృత్తి అనే రీతిలో పలు వురు వలంటీర్లు సర్వే చేయడానికి ప్రయత్నించారు. కానీ, ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత పెల్లుబికింది. తమ వ్యక్తిగత, ఆస్తి వివరాలు మీకెందుకు ఇవ్వాలి? అంటూ ప్రజలు ఏలూరు నగరంలోనే తిరగబడ్డారు. దీంతో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇళ్లకు వెళ్లడం మానేసి, ఫోన్ల ద్వారా సర్వే చేయడం ప్రారంభించారు. ఫోన్లలో అయితే హడావుడి చేసి వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. కాదు, కూడదు అని ఎవరైనా గట్టిగా అడిగితే ఫోన్లు కట్ చేస్తున్నారు. ఇలా ప్రజలను మభ్యపెట్టి మసి పూసే చందాన జరుగుతున్న ఈ కుల గణన సర్వేను గుట్టుచప్పుడు కాకుండా అధికారులు, అధికార పార్టీ నాయకులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా ప్రజలు ఆ యాప్, అందులో వ్యక్తిగత వివరాలతో కూడిన పేజ్‌ను స్ర్కీన్ షాట్ తీయాలని ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ పేజ్ స్ర్కీన్ షాట్ తీయడానికి వీలు లేని విధంగా యాప్‌ను రూపొందించారు. అసలీ ప్రభుత్వం తమపై ఎలాంటి ప్రయోగాలు చేస్తుందో తెలీక గందరగోళానికి గురవుతున్నారు.

జిల్లాలో నివసితమైన ప్రతీ 50-70 ఇళ్ల పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లు తమ వద్ద ఉండే నెంబర్లకు ఫోన్లు చేస్తున్నారు. ఫోన్లు ఎత్తగానే 'నేను మీ వలంటీర్‌ను మాట్లాడుతున్నాను. మీ ఫోన్‌కు ఆధార్ ఓటీపీ వచ్చింది, ఆ నెంబర్ చెప్పండి.' అంటూ సర్వే ప్రారంభమవుతోంది. అసలు ఆ ఓటీపీ ఏంటి? తనకు ఎందుకు పంపారని ఓటరు అడిగేలోపే వలంటీర్లు పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నారు. అలా ఓటీపీ తీసుకున్నాక, వలంటీర్ల వద్ద ఉండే ట్యాబ్‌లలోని యాప్‌లో సచివాలయ ఉద్యోగి తన వేలిముద్రతో పాటు వలంటీర్ వేలిముద్రను స్కాన్ చేస్తారు. ఆ తర్వాతే సంబంధిత వ్యక్తి (ఓటరు) వివరాలు ఆ యాప్‌లో నమోదు చేస్తారు. అందులో భాగంగా వ్యక్తి నివసించే వార్డు, డోర్ నెంబర్, వయసు, అర్బన్ లేదా రూరల్ వంటి వివరాలు తొలుత అడిగి తీసుకుంటున్నారు. ఆనక మెల్లిగా ఇంట్లో ఉపయోగించే గ్యాస్ వివరాలతో మొదలయ్యే కుల గణన సర్వేలో వ్యక్తి పని చేసే వివరాలు, జీతాలు, చదువు, కోళ్లు లేదా గేదెలు ఎన్ని ఉన్నాయి? క్యాస్ట్, సబ్ క్యాస్ట్, ఇంటి స్థలం-ఎన్ని గజాలు, పొలాలు-ఎన్ని ఎకరాలు అంటూ వరుసగా అసలు చిట్టా విప్పుతున్నారు. అవన్నీ దేనికి అడుగుతున్నారని అడిగేలోపే సదరు ఓటరు పూర్తి వివరాలు కుల గణన ముసుగులో ప్రభుత్వం సృష్టించిన యాప్‌లో చేరిపోతున్నాయి. అయితే అక్కడితో సర్వే పూర్తి కాదు, వివరాలు చెప్పాక మరోసారి సంబంధిత వ్యక్తికి మరో ఓటీపీ వెళ్తుంది. ఆ నెంబర్ చెప్పిన పిదప మరోసారి సచివాలయ ఉద్యోగి, వలంటీర్లు తమ తమ వేలిముద్రలను స్కాన్ చేసి పూర్తి వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇలా ప్రజాభిప్రాయాలు, సమస్యలతో సంబంధం లేకుండా జరుగుతున్న కుల గణన సర్వేలో తమ వ్యక్తిగత, ఆస్తి వివరాలను నమోదు చేస్తుండడం తమ భవిష్యత్తుపై ప్రభావం ఎందుకు ఉండదో ఈ ప్రభుత్వం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


# అంతా కల్తీ!



- గాఢ నిద్రలో అధికారులు
- తూతూ మంత్రంగా తనిఖీలు
- ఆహార పదార్థాల్లో రసాయన పౌడర్ల వినియోగం
- విపరీతంగా పెరిగిన రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

జంగారెడ్డిగూడెం, జనవరి 27 : ప్రజల ఆరోగ్యంతో హోటళ్లు, రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్‌లు చెలగాటం ఆడుతున్నాయి. లాభార్జనే ధ్యేయంగా వ్యాపారాలు నడిపిస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు గాఢ నిద్రపోతున్నారు. కస్టమర్లను ఆకట్టుకునేందుకు రసాయనిక పౌడర్‌లు సైతం ఆహార పదార్థాల్లో వాడుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్రమేపీ ప్రజల ఆరోగ్యం క్షీణిస్తోంది. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో హోటళ్లు, రెస్టారెంట్‌లు, రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగున్నా వెలిశాయి. నిబంధనలకు పాతర వేస్తూ వాటిని నిర్వహించి ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్నారు. ముఖ్యంగా తినుబండారాల తయారీలో ప్రమాదకరమైన రసాయనిక పౌడర్లు వాడడం వల్ల ఆకర్షణీయంగా కన్పిస్తున్నాయి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు ప్రజల ఆరోగ్యం పాడవుతుందని తెలిసినా సదరు వ్యాపారులు ఆ పౌడర్‌లను ఆహార పదార్థాల్లో కలుపుతున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు జంగారెడ్డిగూడెం, ఏలూరుల్లోని రెస్టారెంట్‌లలో తనిఖీలు చేసినప్పుడు ప్రమాదకర కృత్రిమ పౌడర్‌లను గుర్తించారు. జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్‌లలో రంగులు మార్చే రసాయనాలను వాడుతున్నారు. పానీ పూరీ, ఫ్రైడ్‌రైస్, చాట్, చికెన్ పకోడి వంటి రోడ్‌సైడ్ ఫుడ్ సెంటర్లు పట్టణాల్లో విపరీతంగా పెరిగాయి. వాటిని తినే వారు ఎక్కువగా ఉండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో కనీస జాగ్రత్తలు, శుభ్రత, నాణ్యత వంటివి పాటించకుండా నాసిరకం, నిల్వ, అపరిశుభ్రంగా ఉండే ఆహార పదార్థాలను సైతం విక్రయాలు సాగిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన సంబంధిత అధికారులు కంటికి కన్పించకపోవడంతో ఇటువంటి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. జంగారెడ్డిగూడెం వాణిజ్య కేంద్రంగా ఉంది. ఇక్కడ విద్య, వైద్యం, ఆరోగ్యం, రవాణా, ఉపాధి, వ్యాపారాలకు అనువుగా ఉంది. చుట్టుపక్కల సుమారు 100 గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడకు వచ్చి వెళ్తుంటారు. చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారు, విద్యార్థులు పట్టణంలోనే అద్దెకు ఇళ్లను తీసుకుని ఇక్కడ ఉంటున్నారు. మరోవైపు ఏజెన్సీలోని ఉద్యోగులంతా పట్టణంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో పట్టణంలో హోటళ్లు, కర్రీ పాయింట్‌లు, రోడ్ సైడ్ ఫుడ్ సెంటర్లకు డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా హోటళ్లు, ఫుడ్ సెంటర్‌ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఫుడ్ సెంటర్‌లు, హోటళ్లపై అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

### ఆహార భద్రత అధికారుల తనిఖీలు



పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారులు

ఆహార పదార్థాల్లో నాణ్యత, శుభ్రత లేకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారులు కావ్యరెడ్డి, రామరాజు హెచ్చరించారు. జంగారెడ్డిగూడెంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్, స్వీట్ స్టాల్స్ దుకాణాల్లో శనివారం ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేశారు. న్యూ భక్తాంజనేయ స్వీట్స్ అండ్ బేకరీ, శ్రీ అంబికా ఫ్యామిలీ రెస్టారెంట్, రాజు ఫుడ్‌కోర్ట్, బామ్మ రెస్టారెంట్, కాజా పంతులు హోటల్, సాయిబాలాజీ ఎంటర్‌ప్రైజెస్, జేబీ గ్రాండ్ రెస్టారెంట్‌లలో తనిఖీలు చేసి బూందీ లడ్డు, చికెన్ ఫ్రై, చికెన్ బిర్యానీ, మినప గుండ్లు, బన్సీరవ్వ, కందిపప్పు, పెసర పప్పు, వేరుశెనగ, మైదా పండి మొత్తం 10 రకాలైన శ్యాంపుల్స్‌ను సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించారు. మరో 15 రోజుల్లో ల్యాబ్ రిపోర్టును పట్టి చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు. హోటళ్లలో గుర్తించిన కలర్ పౌడర్‌లను ధ్వంసం చేశామన్నారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఎం.శ్రీనివాసరావుకు ఫోన్ 98483 16338కు సమాచారం ఇవ్వాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ నిర్వాహకులు నాణ్యతతో ఆహార పదార్థా లను తయారు చేయాలని, వంటశాల పరిశుభ్రంగా ఉండాలని, ఫ్రిజ్‌లలో మిగులుపదార్థాలను నిల్వ ఉంచ వద్దని, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

# జగన్‌ను చిత్తుగా ఓడిద్దాం..

- మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపు
- పోతునూరులో జయహో బీసీ సదస్సు విజయవంతం



సభలో మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్.. వేదికపై మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, టీడీపీ నాయకులు

దెందులూరు, జనవరి 27 : 'ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తన సొంత చెల్లి షర్మిలాకే న్యాయం చేయలేని వాడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏవిధంగా న్యాయం చేస్తాడు. జగన్ అబద్ధపు హామీలు నమ్మి మరోసారి ఓటు వేసి మోసపోవద్దు. ఈసారి జగన్‌ను చిత్తుగా ఓడిద్దాం..'మని టీడీపీ రాష్ట్రనేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. దెందులూరు నియోజకవర్గంలోని పోతునూరు లక్ష్మీపురంలో శనివారం జయహో బీసీ సదస్సు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమన్నారు. మాజీ మంత్రి మరడాని రంగారావు మాట్లాడుతూ ఏలూరులో కోటీశ్వర్లు, అగ్రవర్ణాలు ఉండగా బీసీ అయిన తనకు నాలుగుసార్లు శాసన సభ్యుడిగా, మంత్రిగా అవకాశం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీది మాత్రమే అన్నారు. చింతమనేని ప్రజలకు మంచి చేయాలనే తపనలో అధికారులు, నాయకులు పని చేయకపోతే మాత్రమే కోపగించుకుంటారని కానీ వైసీపీ నాయకులు మాత్రం చింతమనేనిపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. చింతమనేనిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపు ఇచ్చారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జి ఘంటశాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ దెందులూరు సీటును టీడీపీ లేదా జనసేనకు ఇచ్చిన కలిసి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి చింతమనేని, అయ్యన్నపాత్రుడు పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ గ్రామ కార్యదర్శి నున్న లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ తలారి ధన్యకుమార్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ బాబు, టీడీపీ నేత బాయి రామ్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నాని, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణ, కసూకుర్తి రామకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు. తొలుత బీసీ సదస్సుకు వస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, చింతమనేని ప్రభాకర్‌రావులకు కొవ్వలి, పోతునూరు యువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వందలాది మంది బైక్‌లు, కార్లతో ఎదురు వచ్చి స్వాగతం పలికారు. కొవ్వలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు



కలెక్టర్‌ను అభినందిస్తున్న అధికారులు

## జిల్లా కలెక్టర్‌కు అభినందన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 27 : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌కు పలువురు న్యాయ, పోలీస్, రెవెన్యూ, ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. జిల్లా అధికారుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కలెక్టర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ పురుషోత్తమ కుమార్, డీఐజీ అశోక్ కుమార్ పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి, జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో పొగలు



చింతలపూడి, జనవరి 27 : ఏలూరు నుంచి చింతలపూడి వస్తున్న ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం చింతలపూడి శివారు ఆంథోనినగర్ వద్దకు రాగానే ఇంజన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ బస్సు నిలిపివేసి బస్సులోని 35 మంది ప్రయాణికులను దింపివేశాడు. ప్రయాణికులు ఆటోలు, ఇతర వాహనాల్లో చింతలపూడి చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత బస్సును డ్రైవర్ చింతలపూడి బస్టాండ్‌కు చేర్చారు. ఇంజన్ వద్ద నీరు వెళ్లే గొట్టం విరిగిపోవడంతో ఇంజన్ నుంచి పొగలు వచ్చాయని, దానికి సైకిల్ టైర్లు గట్టిగా చుట్టి డిపోకు తీసుకురావాలని టెక్నికల్ సిబ్బంది సూచనలతో ఏలూరు డిపోకు చేరుకున్నట్టు స్థానిక కంట్రోలర్ నాగేశ్వరరావు తెలిపారు.




# ఇంటి బోరుకు రూ.15 వేలు కట్టండి!




- ఏడాది కిందట జంగారెడ్డిగూడెం మునిసిపల్ కౌన్సిల్ ఆమోదం
- ఆదాయం పెంచేందుకే అంటూ అప్పట్లో సమర్థింపు
- ఎన్నికల వేళ తప్పు దిద్దుబాటుకు హడావిడి సమావేశాలు
- భారం తగ్గించాలంటూ కౌన్సిలర్ల కొత్తరాగం

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 27 : ప్రభుత్వం జీవోలు విడుదల చేసేది ప్రజలపై పన్నుల భారం పెంచడానికే అంటూ జీవోలకు కొత్త భాష్యం చెప్పింది రాష్ట్రప్రభుత్వం. కొత్త జీవో వస్తోందంటే ఈసారి ఏ చెత్త పన్ను వేస్తారు.. బాబోయ్ అంటూ బెంబేలెత్తుతున్నారు జనం. ఈ కోవలోనే మేమేం తక్కువ కాదంటున్నారు జంగారెడ్డిగూడెం మునిసిపల్ కౌన్సిలర్లు. ఏడాది క్రితం పట్టణ ఆదాయం పెంచడం కోసం పన్నులు రెట్టింపు చేశారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా కొత్తగా ఇంటి వద్ద బోరు వేసుకోవాలంటే రూ.15 వేలు మునిసిపాలిటీకి చెల్లించాలంటూ తీర్మానం చేసేశారు. వసూళ్లు కూడా బాగానే చేశారు. తీరా ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ ప్రజలపై అదనపు బోరు చార్జీ తగ్గించాలంటూ కౌన్సిలర్లు కొత్తరాగం మొదలు పెట్టారు.

### ఫ్రీగా ఎందుకివ్వాలి..

రోడ్లు, భవన నిర్మాణాలు పట్టణ అభివృద్ధికి చిహ్నాలు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రోడ్లను గాలికి వదిలేసి, నిర్మాణలు చేపట్టే వారి నుంచి అభివృద్ధి పేరిట అడ్డగోలు వసూళ్లు చేస్తోందని భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, బిల్డర్లు వాపోతున్నారు. సాధారణంగా లేఅవుట్ స్థలంలో నిర్మాణం చేపడితే యజమానికి మునిసిపల్ కుళాయి, కరెంటు, కామన్ ప్లేస్, డ్రెయినేజీ, పార్క్, 40 అడుగుల రోడ్డు వంటి సదుపాయాలను కల్పించాలి. నాన్ లేఅవుట్ స్థలంలో నిర్మాణం చేపట్టాలంటే 14.5 శాతం టాక్స్ విధించి సదుపాయాలను అందిస్తారు. యజమానులు ఇంటి నిర్మాణంలో భాగంగానే ఇంటి బోరును ఏర్పాటు చేసుకునేవారు. అయితే ఫ్రీగా ఎందుకివ్వాలి అనుకున్నారో, ఆదాయం పెంచాలనుకున్నారో గాని జిల్లాలో ఎక్కడా లేనివిధంగా జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలో ఇంటి బోరుకు రూ.15 వేలు వసూలు చేయడం మొదలుపెట్టారు. ఎదెక్కడి చోద్యం అంటూ బిల్డింగ్ కాంట్రాక్టర్లు, పలువురు ఇంటి యజమానులు మునిసిపల్ ఉన్నతాధి కారులతో చర్చలు జరిపినా ఫలితం లేదు. చేసేదేమిలేక ఇంటి బోరుకు అదనపు చార్జి చెల్లిస్తూనే నిర్మాణాలు సాగిస్తున్నారు.

### జేబులు నింపేందుకే..

ఏడాది క్రితం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో పట్టణ ఆదాయం అభివృద్ధి పేరిట ఇంటి పన్ను, కుళాయి పన్ను పెంచారు. ఏరియా, ఇంటి స్థలాన్ని బట్టి ఇంటి పన్ను గతం కంటే రూ.500 నుంచి రూ.700 వరకు పెరిగింది. కుళాయి పన్నును రెట్టింపు పెంచారు. ఇందులో భాగంగానే అదనపు చార్జీగా బోరు వేసుకోవాంటే రూ.15 వేలు చెల్లించాలని ఆమోదించారు. పెరిగిన ఇంటి, కుళాయి పన్నులను తక్షణమే అమలు చేసి బోరు చార్జీలను వసూలు చేయలేదు. కాకపోతే ఇంటి నిర్మాణం చేపట్టి బోరు వేస్తుంటే మాత్రం మునిసిపల్ అధికారులు వచ్చి హడావిడి చేసి బోరు నిలుపుదల చేసేవారని పలువురు ఇంటి యజమానులు చెబుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌కు చేయి తడిపితే గాని ఇంటికి బోరు వచ్చేది కాదని పలువురు బిల్డర్లు బాహటంగానే చెబుతున్నారు. గత రెండు నెలలుగా బోరుకు మునిసిపల్ అధికారులు అధికారికంగా రూ.15 వేలు వసూలు చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల జేబులు నింపడానికే ఇటువంటి తీర్మానం చేశారని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు.

### కౌన్సిలర్ల కొత్తరాగం

ప్రజలపై అదనపు భారం ప్రభుత్వానికి మంచిది కాదంటూ కౌన్సిలర్లు కొత్తరాగం మొదలు పెట్టారు. తాజాగా సమావేశం నిర్వహించి పెంచిన భారాన్ని తగ్గించాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదనను కలెక్టర్, సీఎండీఏ అధికారులు ఆమోదించాల్సి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత మార్చి31 తర్వాతనే బోరు చార్జీ తగ్గింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.



రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

## ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ

పెనుగొండ, జనవరి 27: వరి పంట దిగుబడిని తగ్గించే సమస్యలలో పురుగులు, తెగుళ్లతో పాటు ఎలుకలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని వరి పరిశోధనా స్థానానికి చెందిన ఎలుకల విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో దత్తత పథకంలో భాగంగా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, అనూష పాల్గొని ఎలుకల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. వరి పంటపై ప్రధానంగా రెండు జాతులు ఎక్కువగా దాడి చేస్తాయన్నారు. పొలం గట్లపై ఏ విధమైన కలుపు గడ్డిలేకుండా చూసుకోవాలన్నారు. కన్నం చుట్టు ఉన్న పగుళ్ళను మట్టితో మూసివేసి కనీసం 3 నిమిషాలు పాటు పొగ వదలడం ద్వారా ఎలుకలు ఊపిరాడక చనిపోతాయన్నారు. సుమారు 200 కిలోల బ్రోమోడయోల్ ఎర మందును రైతులకు అందజేశారు.మండల వ్యవసాయాధికారి స్పందన, డాక్టర్ ఎంవీ కృష్ణాజి, డాక్టర్ ఆనంద్ కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆక్వా రైతుల సంక్షేమం కోసం బీమా

### అప్సడా వైస్ చైర్మన్ రఘురాం



రొయ్య రైతుల సభలో మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ రఘురాం

వీరవాసరం, జనవరి 27: ఆక్వారైతుల సంక్షేమం కోసం రొయ్యల పంటల బీమా పథకాన్ని అమలు చేయటానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఏపీ స్టేట్ ఆక్వా డవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టనున్న రొయ్యల పంటల బీమా పథకంపై వీరవాసరంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి మళ్ళ తులసి రాంబాబు అధ్యక్షత వహించారు. రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేశారు. బీమా పథకాన్ని ఆంధ్రప్రదేశ్,గుజరాత్ రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయటానికి ముందుకు వచ్చిందన్నారు. రైతులు వ్యక్తం చేసిన అనుమానాలను, సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అందరికీ ఆమోద యోగ్యమైన బీమా పథకం ప్రవేశపెట్టేలా చూస్తామని తెలిపారు. రొయ్యల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మోహనరాజ్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, డీఎఫ్‌వో అంజలి, మండల రొయ్యలరైతు సంఘం ప్రతినిధులు యరకరాజు గోపాలకృష్ణంరాజు, మళ్ళ శ్రీరామమూర్తి, నాగరాజు గోపిరాజు, గుండా నర్సింహారావు పాల్గొన్నారు.

## శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



ద్వారకాతిరుమల, జనవరి 27: ద్వారకా తిరుమల ఆలయం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. దాదాపు 15 వేల మందికి పైగా భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారులు అంచనా. దర్శనానంతరం శ్రీవారి ఉచిత అన్నప్రసాదాన్ని యాత్రికులు స్వీకరించారు.

## జిల్లా వెబ్‌సైట్లో వైద్య ఉద్యోగార్థుల తాత్కాలిక మెరిట్ జాబితా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 27 : రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య డైరెక్టర్ పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టును జిల్లా వెబ్‌సైట్‌లో పొందుబర్చినట్టు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలోని వివరాలపై ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రాజ మహేంద్రవరంలోని తమ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా ఇ-మెయిల్ ద్వారా తెలియజేయాలని సూచించారు. తాత్కాలిక మెరిట్ జాబితాలను పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల వెబ్‌సైట్లలో కూడా పొందుపరిచినట్టు వివరించారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి పోటీలు

జంగారెడ్డిగూడెం, జనవరి 27 : 67వ రాష్ట్ర స్థాయి అండర్ 19 బాల బాలికల టెన్నికాయిట్ పోటీలు జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరగనున్నట్టు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

## నేడు, రేపు అంతర్ జిల్లాల అండర్-19 బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు

ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం నారాయణపురంలో 45వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాలుర అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. టోర్నీ ఏర్పాట్లను పూర్తిచేసినట్లు తెలిపారు. 16 జట్లు సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి అంటే ఆసుపత్రికి డోలీలో తీసుకువెళ్లడమేనా : సీపీఐ రామకృష్ణ

కుక్కునూరు, జనవరి 27 : గిరిజన గ్రామాల నుంచి గర్భిణులను, అనారోగ్య బాధితులను ఆసుపత్రికి డోలీల్లో తీసుకువెళ్లడమేనా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సాధించిన అభివృద్ధి అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. కుక్కునూరు మండలం జిన్నెలగూడెం వలస ఆదివాసీ మహిళ పురిటినొప్పులతో ప్రసవ వేదన పడుతుంటే గ్రామస్థులు డోలీ కట్టి ఆసుపత్రికి తరలించిన ఘటనపై రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. శనివారం ఆయన పత్రికలకు ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. గిరిజన గ్రామాల ప్రజల సౌకర్యార్థం రహదారి మార్గాలు ఏర్పాటు చేయాలని, వైద్య సదుపాయాలు, విద్యుత్, తాగునీరు, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.



## జైల్ తనిఖీ చేసిన న్యాయాధికారి

భీమవరం క్రైం, జనవరి 27 : బెయిల్‌పై బయటకు వెళ్ళిన వారు కేసు పూర్తయ్యే వరకు ప్రతీ వాయిదాకు హాజరు కావాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ధనరాజు అన్నారు. శనివారం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ధనరాజు స్థానిక ప్రత్యేక కారాగారాన్ని తనిఖీ చేశారు. ముందుగా వంటశాలను, ఆహార పదార్థాలను, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. జైల్ విజిటింగ్ లాయిర్ లోకేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ భవాని, కృపానందం, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.



## గోశాలకు రూ. 5 లక్షల విరాళం

ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం నాచుగుంట గోపాలకృష్ణ గోశాలలో ప్రకృతి వ్యవసాయ శిక్షణకు దాతలె రూ. 5 లక్షల విరాళం అందజేశారు. తాడేపల్లిగూడేనికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమార్తె పసల కృష్ణభారతి రూ.5 లక్షల విరాళాన్ని తన తండ్రి కృష్ణమూర్తి జయంతి పురస్కరించుకుని అందించారు.



# సైరన్

## అడిగేవారెవరు..ఆపేవారెవరు..!

### చోటా, బడా నాయకుల వాహనాలకూ సైరన్లు

### అదేబాటలో కొందరు అధికారులు

### నిబంధనలు బేఖాతర్

జంగారెడ్డిగూడెం టౌన్, జనవరి 27 : అత్యవసర సేవలైన పోలీస్, అగ్ని మాపకదళం, రవాణాశాఖ, అంబులెన్స్‌లు మినహా మరే ఇతర వాహనాలకు అత్యవసర సైరన్‌లను వినిగించరాదని మోటార్ వెహికల్ చట్టం చెబుతుంది. అయితే ఈ నిబంధనలను జిల్లాలోని కొందరు నాయకులు, అధికారులు పెడచెవిన పెట్టి రోడ్లపై సైరన్‌లు మోగిస్తూ రయ్ రయ్‌మంటూ దూసుకు పోతున్నారు. చట్టాలను అమలు పరిచే అధికారులు, ప్రజలచే ఎన్నుకోబడ్డ నాయకులు కనీస అవగాహన లేకుండా సైరన్‌లను వినియోగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొందరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు వంటి అధికారులు, సర్పంచ్, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, మంత్రుల అనుచరులు విచ్చలవిడిగా సైరన్‌లను వినియో గించడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అనధికార సైరన్‌లతో ప్రజల్లో గందరగోళానికి గురిచేస్తూ కనీసం ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద కూడా వాహనాన్ని నిలపకుండా దూసుకుపోతున్నారు. జంగారెడ్డిగూడెంలో అనధికార సైరన్‌లు వినియోగించే వాహనాలకు కొదవే లేదు.

### సైరన్‌లతో చట్ట విరుద్ధ పనులు

మరోవైపు కొందరు ఆకతాయిలకు ఈ సైరన్‌లు ఆటవస్తువులుగా మారాయి. రోడ్లపైకి రావడం సైరన్‌ల మోత మోగించడం అలవాటైపోయింది. వాహనాలకు సైరన్‌లను ఏర్పాటు చేసి చట్ట విరుద్ధమైన పనులకు కొందరు ఆకతాయిలు పాల్పడుతున్నారు. టోల్‌ప్లాజాల వద్ద సైరన్ మోగిస్తూ టోల్‌ఫ్రీ చెల్లించకుండా ఉడాయించడం, అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా సిగరెట్లు, బెల్టు దుకాణాల వద్ద సరుకు తీసుకొని సైరన్ మోగిస్తూ ఆకతాయిలు చెక్కేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### భారీ జరిమానా విధిస్తాం



అత్యవసర సేవలందించే వాహనాలు మినహా మిగిలిన వాహనాలకు రవాణాశాఖ అనుమతి లేకుండా సైరన్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటాం. దీనిపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తాం. సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

**- ఎండీ మదాని, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, జంగారెడ్డిగూడెం**

### ఎప్పుడు ..ఎవరు వాడాలి ?

అత్యవసర సమయంలో ఘటనా స్థలానికి వెళ్లే ముందు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు సైరన్‌ను వినియోగిస్తారు. రోగి, క్షతగాత్రుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ప్రాణాలను రక్షించే క్రమంలో అంబులెన్స్ సైరన్‌ను వాడతారు. (రోగి ప్రాణాల దృష్ట్యా అంబులెన్స్‌లకు కొన్ని ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. కొందరు రోగులను తరలించే క్రమంలో సైరన్ వేయకూడదనే నిబంధన ఉంది.) మంటలను ఆర్పే క్రమంలో అగ్నిమాపకదళం సైరన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేస్తూ ఘటనా స్థలానికి చేరుకుంటారు.



# పులి బాబోయ్ పులి !

### భయంతో వణుకుతున్న జనం

### పెరుగుగూడెం, మేదినరావుపాలెంలో కలకలం

దెందులూరు, జనవరి 27 : పులి..బాబాయ్ పులి.. అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. పులి పశువుని తింటున్న వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం అవుతుండటంతో గ్రామాల్లోని ప్రజలందరూ భయందోళన చెందుతున్నారు. కూలీలు, రైతులు పనులకు వెళ్లడం మానేశారు. రైతులు పాలు తీసుకునేందుకు పొలాల్లోకి వెళ్లడం లేదు. శనివారం దెందులూరు మండలం మేదినరావు పాలెం పోలవరం కాల్వ పక్కనే ఉన్న గట్టు వద్ద పులి అడుగులు కనిపించడంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున కర్రలు, గునపాలతో వెతికారు. పులి అడుగుల గుర్తులు కనిపిం చడంతో వీఆర్వోకి సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులకు సమా చారం ఇచ్చారు. శుక్రవారం పెరుగుగూడెం గ్రామానికి చెందిన యలమర్తి బాపారావు కుమారుడు వేణుగోపాల్‌కు చెందిన గేదెల పాక వద్ద, మొక్కజొన్న తోటలో పులి తిరిగిన గుర్తులు ఉన్నాయంటూ అందిన సమా చారం మేరకు అటవీ శాఖ అధికారి కుమార్ సిబ్బందితో వచ్చి గుర్తులను పరిశీలించారు. ద్వారకా తిరుమల మండలం సత్తెనపల్లిలోను అదేరోజు పులిగుర్తులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. పెరుగు గూడెం, సత్తెనగూడెంలో ఉన్న అడుగులు పులివే అని చెప్పారు. కానీ అడవి నుంచి 30 కిలోమీటర్ల వరకూ బయటకు వచ్చి ప్రయాణించిన పులి జంతువులు, పశువులమీద గానీ దాడి చేయలేదని తిరిగి వెళ్లిందా లేక ఇక్కడే ఉందా అనే దానిపై స్పష్టత కోసం పోలీసు, అటవీశాఖ సిబ్బంది విచారిస్తున్నారని తెలిపారు. నాలుగు గ్రామాల ప్రజలు ఒంటరిగా పొలాల్లోకి వెళ్లవద్దని ఏవిధమైన సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్ 1800-4255909కు ఫోన్ చేయాలని కుమార్ తెలిపారు.



మేదినరావుపాలెం మొక్కజొన్న తోటలో పులి కాలు గుర్తులు

### యర్రమిల్లిపాడు మొక్కజొన్న చేలల్లో ...



ఉంగుటూరు, జనవరి 27 : ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు రైతు పోతురాజు మొక్కజొన్న చేలో పాదముద్రలు కనిపించాయి. పలుచోట్ల పంట పాడు చేయడంతో పాటు పైపులైను ధ్వసం అవ్వడంతో రైతులు అనుమానం వచ్చి చేబ్రోలు పోలీసులకు తెలిపారు.ఎస్ఐ కిరణ్ కుమార్ అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వగా ఫారెస్ట్ రేంజర్ కుమార్ తన సిబ్బందితో వచ్చి పరిశీలించారు. అడవి పందుల గుంపు వచ్చి ఉంటుందని, వాటి పదునైన దంతాలతో పైపులైన్లు, పంటను నాశనం చేసి ఉంటాయని వివరించారు. నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల ప్రాంతాలలో పెద్ద పులి తిరుగుతుందంటూ ఆయా మండలాల ప్రజలు భయాందోళన చెందుతు తున్నారని భయం అవసరం లేదన్నారు.

### అవి పులి పాద ముద్రలే..

ఏలూరు, జనవరి 27: ఏలూరు సెక్షన్ రామసింగవరం బీట్ పరిధిలో గల దెందులూరు మండలం పెరుగుగూడెంలో సంచరిస్తున్న జంతువు పాద ముద్రల పరిశీలించిన పిమ్మట పెద్దపులి పాదముద్రలుగా నిర్ధారించి నట్టు జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా గాయపరచుట గానీ, చంపుట గానీ, చేసినట్లయితే వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు.

### భయపడాల్సిన అవసరం లేదు : ఎస్పీ

ఏలూరు క్రైం, జనవరి 27 :పలు మండలాల్లో పులి సంచారమని వస్తున్న వార్తలు నమ్మి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారంపై అటవీశాఖ, పోలీస్‌శాఖ అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టారన్నారు. ఏదైనా సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, 112 నంబర్లకు, ఏలూరు పోలీస్ కంట్రోల్ 83329 59179 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.






ఉత్సవాలను ప్రారంభిస్తున్న దేవదాయశాఖ కమిషర్ రాము సత్యనారాయణ.. భక్తుల కోలాట ప్రదర్శన

## ధర్మ ప్రచార మహోత్సవాలు ప్రారంభం

పాలకొల్లు టౌన్, జనవరి, 27 : పాలకొల్లు క్షీరారామలింగేశరస్వామి ఆలయంలో ధార్మిక పరషత్, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సనాతన హిందూ ధర్మ పరిరక్షణ ధర్మ ప్రచార మహోత్సవాలను శనివారం దేవదాయశాఖ కమిషనర్ రాము సత్యనారాయణ ప్రారంభించారు. ఆలయ అర్చకులు, పండితులు ముందుగా విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి సామూహిక మంగళగౌరి కుంకుమ పూజలు నిర్వ హించారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ కోరాడ శ్రీనివాసరావు, ఆవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్, ఉప కమిషనర్ ఎం.విజయరాజు, అధికారి వెంకట సుబ్బారావు, మావుళ్లమ్మ ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### వ్యాన్ ఢీకొని మోటారు మెకానిక్ మృతి



ఆకివీడు, జనవరి 27: బొలెరా వాహనం ఢీకొని మోటారు సైకిల్ మెకానిక్ మృతి చెందాడు. ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతంలో ఉంటున్న నడింపల్లి సాయి చందు (25) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం షాపునకు వెళుతుండగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆకివీడు నుంచి అయి-భీమవరం వైపు వెళ్లుతున్న బొలెరా వేగంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి సిద్దూ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేశారు. హెల్మెట్ ధరించి ఉంటే మరణించేవాడు కాదని ఎస్ఐ అన్నారు. హెల్మెట్లు ధరిస్తే కుటుంబాలు రోడ్డున పడవన్నారు. సంతాప సూచికంగా మెకానిక్ దుకాణాలు మూసివేశారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెదపాడు, జనవరి 27 : పెదపాడు గ్రామానికి చెందిన తోట సాయి కిషోర్ (48) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లుగా పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు. సాయికిషోర్ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపునొప్పి భరించలేక శుక్రవారం రాత్రి పురగుమందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం చినఅవుటపల్లి పిన్నిమనేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మహిళ అదృశ్యం..కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 27 : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము శ్యాంబాబు ఈ నెల 24వ తేదీన బంధువులు అనారోగ్యంతో ఏలూరు ఆసుపత్రిలో చేరడంతో చూడడానికి వెళ్లాడు. ఉదయం ఇంటికి వచ్చి చూస్తే తన భార్య కన్పించలేదని, చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. భర్త ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

### సారా విక్రయం.. కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 27 : సారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లుగా ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. బందంచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి సారా విక్రయిస్తున్నాడనే సమాచారంతో శనివారం సిబ్బందితో దాడి చేసి 8 లీటర్ల సార స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

### రావులపర్రులో 90 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఉంగుటూరు,జనవరి 27 : ఉంగుటూరు మండలం రావులపర్రులో శనివారం సాయింత్రం చేబ్రోలు పోలీసులు అనుమతి లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 90 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మణిమణికుమార్ తెలిపారు.గ్రామానికి చెందిన కొనకళ్ళ వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

పెదవేగి, జనవరి 27 : పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ చేశారని ఏఎస్ఐ పి.జోసెఫ్ తెలిపారు కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన మాదాల ఫణీంద్రకు చెందిన వ్యవ సాయ మోటారు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండు రోజుల కిందట గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి అందులో ఉండే రాగివైరును చోరీ చేశారు. పెదవేగి ట్రాన్స్‌కో ఏఈ నాగశేషుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

### పది రోజులుగా సెల్‌టవర్ పైనే..



భీమవరం క్రైం, జనవరి 27 : భీమవరం మండలం చినఅమిరం గ్రామా నికి చెందిన లోకం ఏసు జువ్వలపాలెం రోడ్డులో పది రోజులుగా సెల్‌టవర్ పైనే ఉంటూ న్యాయం చెయ్యాలని కోరుతున్నాడు. తన తండ్రికి సంబం ధించిన ఇన్సూరెన్స్ పత్రాల బ్యాంక్ వారు ఇవ్వకుండా మోసం చేశారంటూ న్యాయం చెయ్యాలని కోరుతూ టవర్‌పైనే కూర్చున్నాడు. ఈనెల 18వ తేదీన ఉదయం 5 గంటల నుంచి టవర్‌పైనే ఉన్నాడు. ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అక్కడే వేచి చూస్తున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా దిగడం లేదు. అయితే అతనికి ఆహారం ఎలా అందుతుంది ? రోజువారీ కార్యక్రమాలు ఎలా జరుగు తున్నాయి? అనేది పెద్ద ప్రశ్నగా మారింది.

### భీమవరంలో చేతబడి కలకలం



భీమవరం క్రైం, జనవరి 27 : భీమవరం వన్‌టౌన్‌లోని మెంటేవారితోట పరిధిలో నివాసిత ప్రాంతాల మధ్యన చేతబడి కలకలం రేపింది. కొన్ని రోజులుగా ఆయా వీధుల్లోని కొందరి ఇళ్ళ ముందు నిమ్మకాయలు, కొబ్బరి, పసుపు, కుంకుమ ఇతరత్రా సామాగ్రి ఉంచి ఆందోళనకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోయారు. శుక్రవారం రాత్రి ఓ ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలపై పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, నిమ్మకాయలు ఉంచడంతో ఆ ప్రాంత వాసు లంతా ఆందోళన చెందారు. విషయం తెలియడంతో పోలీసులు వెళ్లి సీసీ టీవీ పుటేజీ పరిశీలించారు

## 26 మంది ఎంపీడీవోలు బదిలీ

ఏలూరుసిటీ, జనవరి 27: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఎన్నికల బదిలీలు ప్రారంభం అయినాయి. ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖలలో బదిలీలు జరుగుతుండగా తాజాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 26 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు.వీరిలో 13 మంది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు, 13 మంది ఉమ్మడి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 10 మంది ఎంపీడీవో పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 15 మంది జిల్లాకు వచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎంపీడీవోలు వెంటనే రిపోర్టు చేయాల్సి ఉంది.

**బదిలీ అయిన ఎంపీడీవోలు**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కె.శ్రీదేవి, జ్యోతిర్మయి, ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనోజ్, కె.వాణి, ఎండీ అమీల్ జమా, కె.వెంకటలక్ష్మి, ఎం.మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపాణి, ఏ.శ్రీనివాస్, కెఎస్ఆర్ కృష్ణప్రసాద్,టి.సూర్యనారాయణమూర్తిలు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్ఎం గంగాధరరావు ,సీహెచ్ పద్మావతి, ఆర్ బేబిశ్రీలక్ష్మి ,పి.శ్రీనివాస్ ,ఎస్.ఆశీర్వాదం, పి.శామ్యూల్, జి.విజయకుమారి ,బీఎస్ఎల్ మంగకుమారి, ఎం.విశ్వనాథ్ , కె.కిరణ్‌కుమార్, జీవీఎస్ రామకృష్ణంరాజు, ఎన్.ప్రేమాన్విత , కుంజా జ్యోతిలు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు.

**బదిలీపై వచ్చిన వారు**

వై.రామకృష్ణ, స్వామలత, పి.శ్రీనివాసరావు ,జె.స్వామభారతి, కె.జోగేశ్వరరావు, సీహెచ్ చిన రత్నాలు, టి.అనూహ్య, ఏవీ రమణ,పి.అనూష , సుధాప్రవీణ్‌లు ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వచ్చారు. ఎన్.బొజ్జి , కె.నరేంద్రరెడ్డి, కె.హిమా మహేశ్వరి, జెఎ ర్యూన్సీ, కడలి పద్మజ్యోతి, పీఎస్ నరేష్‌కుమార్ , వెంకటరామన్, డీఎల్ఎస్ శర్మ, ఎం.ప్రేమ్‌సాగర్ , జిశివరామకృష్ణయ్య, మటపర్తి అన్నపూర్ణ, బి.అశోక్ కుమార్, డి.శ్రీలలిత, కె.రమేష్, ఎస్. సుబ్రహ్మణ్య శర్మ ఉమ్మడి తూర్పుగోదావరి పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చారు.



అబ్బిరాజుపాలెంలో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న దృశ్యం

## అబ్బిరాజుపాలెంలో మట్టి తవ్వకాలు

### అడ్డుకున్న స్థానికులు..

### అనుమతులు ఉన్నాయంటూ తరలింపు

యలమంచిలి, జనవరి 27: అబ్బిరాజుపాలెం లంకభూముల్లో తువ్వమట్టి తవ్వకాలు జరిపి లారీల్లో తరలిస్తుండగా పలువురు గ్రామస్థులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తహసీల్దారు సునీల్‌కుమార్, ఎస్ఐ శివన్నారాయణ సిబ్బందితో తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనుమతులు లేకుండా తువ్వమట్టిని తరలించడమేమటని పలువురు గ్రామస్థులు, టీడీపీ, జనసేన నాయకులు అధికారులను ప్రశ్నించారు. కన్జర్వెన్సీ ఈఈ అనుమతులు ఇచ్చారని ఆడుదాం ఆంధ్రా కోసం మండలంలోని పాఠశాలల క్రీడా మైదానాల్లో వేసేందుకు మట్టిని తరలిస్తున్నామని చెప్పారు. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారుల దగ్గరుండి తువ్వమట్టి తవ్వకాలు జరిపించారు. అనుమతుల కాపీలను తమకు ఇవ్వాలని గ్రామస్థులు తహసీల్దారును అడగ్గా పత్రాల కోసం ఎంపీడీవోను సంప్రదించాలన్నారు. ఇదిలా ఉంటే ఆడుదాం ఆంధ్రా పోటీలు ముగిసిన తరువాత క్రీడామైదానాల్లో వేయడానికి మట్టిని తరలిచడం ఏమిటో విడ్డూరంగా ఉందని పలువురు గ్రామస్థులు చెవులు కొరుక్కుంటున్నారు. అధికారులు అనుమతులు ఉన్నాయని చెప్పడంతో కన్జర్వెన్సీ ఈఈ కి తాము ఫోన్ చేసి అనుమతులు ఇచ్చారా అని అడిగామని దీనిపై ఈఈ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు చెబుతున్నారు. వైసీపీ పార్టీ కార్యాలయ ఆవరణలో నింపేదుకు మట్టిని తరలిస్తున్నారని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

## ఈ ఏడాది నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు

### జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్

ఏలూరు క్రైం, జనవరి 27 : కేసుల పరిష్కారంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచిందని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్ చెప్పారు. 2024వ సంవత్సరంలో జాతీయ లోక్ అదాలత్‌ల నిర్వహణపై స్థానిక న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారిలతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ ఏడాది మార్చి 9, మే 11, సెప్టెంబరు 14, డిసెంబరు 14 తేదీల్లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని చెప్పారు. లోక్ అదాలత్ ప్రారంభమయ్యే ముందుగానే రాజీ కాదగిన కక్షిదారులు తమ కేసుల వివరాలను తెలియజేయవచ్చునని, ఇరు పార్టీల వారితో ముందుగానే చర్చించి కౌన్సెలింగ్ ద్వారా జాతీయ లోక్ అదాలత్ తేదీనాటికి కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్ హోం కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసైతో యశోద ఆసుపత్రి చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథ రామారెడ్డి దంపతులు

## గోకుల పారిజాత గిరి శ్రీవారికి ప్రత్యేక పూజలు


వేంకటేశస్వామి ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం, జనవరి 27 : గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని అష్టోత్తర పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం చెందిన గుడిపూడి సత్యనారాయణ, వెంకటనాగమణి కుమారుడు హర్షిద్ రాహుల్‌కు ఉద్యోగం రావడంతో మొక్కుబడిగా మొదటి జీతం రూ.1,00,232 విరాళంగా ఈవో మానికల రాంబాబు చేతుల మీదుగా దేవస్థానంకు అందజేశారు. రెండో రోజు శనివారం ఆలయంలో అధ్యయనోత్సవాలు కొనసాగాయి.

## కలెక్టర్‌ను కలసిన వీఆర్వోల సంఘ నాయకులు


కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న వీఆర్వోల సంఘ రాష్ట్ర నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 27: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు ఇవ్వడానికి కౌన్సెలింగ్‌కు 21మంది వీఆర్వోలను ఆహ్వానించడంపై రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజురవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్‌ను సంఘ నాయకులు కలిసి పూలమొక్క అందజేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీరామచంద్రమూర్తి, రవికుమార్, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు సాయిల వెంకటేశ్వరరావు, జోషి, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

## 'వచ్చే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి'

కామవరపుకోట, జనవరి 27 : వచ్చే ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు ఐకమత్యంగా ఉండి సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్‌కిషోర్, క్లస్టర్ కో-ఇన్‌చార్జి కోడూరి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం చింతలపూడి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ ఒంటెద్దు ఏసువరప్రసాద్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలో, చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ జెండాలు ఎగురవేసే విధంగా ప్రణాళికలు రూపొంది ముందుకు వెళ్దామని సూచించారు. బూత్ కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని పటిష్టం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ ఏలూరు పార్లమెంటు కన్వీనర్ కట్నేని లక్ష్మీకృష్ణప్రసాద్, జిల్లా ఇన్‌చార్జి ఎ.పి.ఆర్.చౌదరి, పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల ఇన్‌చార్జి కట్టా సత్యనారాయణ, అసెంబ్లీ కో-కన్వీనర్ దిడ్ల యాంజిలో తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి'


సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి, జనవరి 27 : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. శనివారం నాగిరెడ్డిగూడెం రోడ్డులోని ఒక ప్రైవేటు పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు. సదస్సులో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లింగ వివక్ష, బాల్య వి వాహాలు, నిర్బంధ విద్యాహక్కు, బాల కార్మిక చట్టంపై వివరించారు. సదస్సులో ఐసీడీఎస్ పీవో మాధవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, న్యాయవాదులు ఉమర్ ఫరూఖ్, దుర్గాభవాని, ఎం.డి.అక్బర్‌ఆలీ, అశోక్‌బాబు అవగాహన కల్పించారు.

## టీచర్ సీతమ్మకు ఉద్యోగ విరమణ సన్మానం


సీతమ్మను సన్మానించిన ఉపాధ్యాయులు

జీలుగుమిల్లి, జనవరి 27: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల్లో ఉపాధ్యాయురాలు సీతమ్మ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. విశ్రాంత డీవైఈవో మొడియం రామరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాలకు ఎటువంటి రవాణా సౌకర్యాలు లేని నాటి నుంచి నేటి వరకు గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి తీర్చి దిద్దారన్నారు. అనంతరం బాలికలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టినరసాపురం మండలాల్లో ఉపాధ్యాయ సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. ఎంఈవో కె.శ్రీనివాస్, హెచ్‌ఎంలు ఎం.రమాదేవి, ఎం.పుల్లారావు, సిబ్బంది సావిత్రి, పీరమ్మ, సత్యవతి, లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

## 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

జీలుగుమిల్లి, జనవరి 27 :దర్భగూడెంలో పీపీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక సచివాలయ వద్ద శనివారం రోగులకు బీపీ షుగర్, రక్త పరీక్షలు చేసి 200 మందికి ఉచితంగా మందులు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కొల్లూరి రాంబాబు, సర్పంచ్ సున్నం ఉషారాణి, ఉప సర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీటీసీ సున్నం సురేష్, జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, పాలడుగుల సురేష్ తదితరులు ఉన్నారు.

## నూకాలమ్మ ఆలయానికి రూ.1,51,116 విరాళం

జంగారెడ్డిగూడెం, జనవరి 27 :జంగారెడ్డిగూడెం నూకాలమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన అల్లూరి రామచంద్రరావు, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు రామకృష్ణ, వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,51,116 విరాళం శనివారం అందించారు. ఆలయంలో నిత్యపూజా కైంకర్యాలు, హారతి పూజలు అర్చక స్వాములు మనోజ్ శర్మ నిర్వహించారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ అమ్మవారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని ఇచ్చి వేద పండితుల ఆశీర్వాదాలతో ఘనంగా సత్కరించారు.

## చిరంజీవికి పద్మవిభూషణ్ ప్రకటనపై హర్షం

కుక్కునూరు, జనవరి 27 : మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషన్ అవార్డు రావడం పట్ల మండల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సినీరంగంలో, సామాజిక సేవా రంగంలో చిరంజీవి చేసిన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యున్నత పురస్కారంకు ఎంపిక చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగందర్, ఎం.వెంకన్నబాబు, మంత్రి గోపాలకృష్ణ, సీతారామయ్య, గంధం నాగరాజు, లక్ష్మణస్వామి, వీరబాబు పాల్గొన్నారు.

## నేడు చింతలపూడిలో టీడీపీ శిక్షణ కార్యక్రమం

చింతలపూడి, జనవరి 27 : తెలుగుదేశం పార్టీ చింతలపూడి నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని టీడీపీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా ఈ శిక్షణ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. చింతలపూడి మండల, పట్టణ శాఖకు చెందిన కన్వీనర్లు పాల్గొనాలని, రాష్ట్ర కార్యాలయం నుంచి శిక్షణ టీమ్ వస్తుందన్నారు.

## ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం

పెదపాడు, జనవరి 27 : సత్యవోలు గ్రామంలో దుర్గాఫణీంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా కలిగివున్న ఎనిమిది క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శుభశేఖర్ తెలిపారు. శనివారం మద్యం బాటిళ్ల ఉన్నాయని సమాచారంతో ఇంట్లో తనిఖీలు నిర్వహించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

## సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం ఏలూరులోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
- ఉంగుటూరు : కైకరం-కొత్తూరులోని ఫౌండేషన్ పాఠశాలకు శనివారం మానవత ఆధ్వర్యంలో మానవత మండల అధ్యక్షుడు గంజి రవి, పుప్పాల గోపి, ఎంపీటీసీ-3 పంతుల వెంకన్నబాబు తదితరుల ఆధ్వర్యంలో గ్రీన్ చాక్ బోర్డును అందజేశారు.
- జంగారెడ్డిగూడెం : కరెంటు బల్బు కనుగొనడంతో ప్రపంచ మానవాళి చరిత్రలోనే అభివృద్ధికి నాంది పడిందని అమెరికాకు చెందిన థామస్ ఆల్వా ఎడిషన్ బల్బును కనుగొన్న జనవరి 27ను పురస్కరించుకొని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ప్లంబర్స్ మెకానిక్ యూనియన్ జెండాను యూనియన్ అధ్యక్షుడు బాలిన ధర్మరాజు ఎగరవేశారు.
- టి.నరసాపురం, : బొర్రంపాలెంలో దోమల బెడద ఎక్కువగా ఉండడం వల్ల మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు కుమారుడు సామాజిక వేత్త అభిషేక్‌బాబు సొంత వ్యయంతో గ్రామంలో దోమల మందును పిచికారీ చేయించారు.




ఏలూరు-పుష్పలీలానగర్‌లో మేనిఫెస్టోను వివరిస్తున్న చంటి, కొండగూడెంలో ఇంటింటికీ టీడీపీ శ్రేణులు, కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న పారేపల్లి నరేశ్

# జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది / టీడీపీ ఏలూరు ఇన్‌చార్జి బడేటి చంటి

ఏలూరు టూటౌన్, జనవరి 27: జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే బేలగ మాట్లాడుతున్నాడని టీడీపీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. శనివారం పుష్పలీలా నగర్‌లో ప్రజాసంకల్పయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం.. మహిళా అభ్యదయం టీడీపీతోనే సాధ్యమన్నారు. ఒక్క అవకాశం అంటూ జనాల్ని మభ్యపెట్టి అధికారం చేపట్టి రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడ న్నారు. జగన్ నిజస్వరూపాన్ని చెల్లెలు షర్మిల బట్టబయలు చేస్తుండడంతో వైసీపీ నాయకులంతా హడలెత్తిపోతున్నారని అన్నారు. రెడ్డి నాగరాజు, తంగిరాల అరుణాసురేష్, ఎస్.కృష్ణవేణి, చంద్రశేఖర్, రామారావు, ఎం.ఉమా, సైదులు, కృష్ణ పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించండి : నరేశ్

కొయ్యలగూడెం : ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేశ్ కోరారు. శనివారం కొయ్యలగూడెం మండలంలోని క్లస్టర్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాను పరిశీలించి ఏమైన దొంగ ఓట్లు ఉంటే తేల్చాలని తెలిపారు. ఓటు ఉన్నదిలేనిది కూడా చూసుకోవాలన్నారు.

### కొండగూడెంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ'

కామవరపుకోట, : టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి బొబ్బిలి డాన్ దివాకర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొండగూడెం గ్రామంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి సూపర్-6 పథకాల బ్రోచర్లను అందజేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలతో కూడిన బాండ్ పత్రాలను పంపిణీ చేశారు. కూటమిగెలవడం ద్వారా అన్నివర్గాలకు అందరికీ ప్రయోజనం కలుగుతుందన్నారు.

## వైసీపీకి బుద్ధి చెప్పండి : రెడ్డి అప్పలనాయుడు


ఏలూరు 31వ డివిజన్‌లో పాదయాత్ర చేస్తున్న జనసేన నాయకులు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 27 :ప్రజా వ్యతిరేక విధానాలతో, నియంతృత్వ పోకడలతో పరిపాలన కొనసాగిస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ బుద్ధి చెప్పాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం జనసైనికులు 31వ డివిజన్ అశోక్‌నగర్‌లో పాదయాత్రను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న ఎమ్మెల్యే నాని ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జగన పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, గత టీడీపీ పాలనలో 80 శాతం పూర్తి చేసిన టిడ్కో గృహాలను నాలుగున్నరేళ్ళుగా లబ్ధిదారులకు ఇవ్వలేకపోయిన చేతకాని ప్రభుత్వమన్నారు. ప్రజా సంక్షేమం కోసమే టీడీపీతో జత కట్టామని అన్నారు. పాదయాత్రలో జనసేన నాయకులకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, నిమ్మల జ్యోతికుమార్, సుందరనీడి ప్రసాద్, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, పల్లి విజయ్, అల్లు సాయిచరణ్, కందుకూరి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 4వ రోజు సెర్ప్ ఉద్యోగుల ఆందోళన


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న క్రాంతి పథం ఉద్యోగులు

ఏలూరు కలెక్టరేట్, జనవరి 27: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సెర్ప్ ఉద్యోగుల సమ్మె శనివారం నాలుగోరోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని ఉదయం ఏపీ స్టేట్ సెర్ప్ ఎంప్లాయిస్ జేఏసీ ఏలూరు జిల్లా ఛైర్మన్ వి.బాపూజీ, కో-కన్వీనర్ సీహెచ్ సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత 22 ఏళ్లుగా హెచ్‌ఆర్ పాలసీ సౌకర్యం కలిగి ఉన్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ, జగనన్నతోడు వంటి సంక్షేమ పథకాలు అందించడంలో కీలకపాత్రపోషిస్తున్నామని తెలిపారు. సీఎం నిర్వహించే సభలో సమావేశాలకు పెద్దఎత్తున మహిళలను సమీకరించి విజయవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు. అనేకసార్లు ఉద్యోగులను క్రమబద్ధీకరించి పే-స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విధిలేక సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. సెర్ప్‌లో అవసరమైన పోస్టుల మంజూరుకు జీవో విడుదల చేసి ప్రస్తుతం సీలింగ్ విధానానికి బదులుగా వంద శాతం బేసిక్‌పేపై ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ అమలు చేయాలని తగ్గించిన హెచ్‌ఆర్‌ఏని సవరించి హెచ్‌ఆర్‌ఏ మంజూరులో పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## తూతూమంత్రంగా మండల పరిషత్ సమావేశం


వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో ప్రణవి

ఏలూరు రూరల్, జనవరి 27: ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.శ్రీనివాసరాజు అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. ప్రతి మూడునెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ సమస్యలను సభదృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. నాడు-నేడు ఫేజ్-2లో భాగంగా పనులు పూర్తి కావచ్చాయని శ్రీపర్రులో అదనపు తరగతి గదులు పూర్తికావాల్సి ఉందని ఎంఈవో తెలిపారు. మాదేపల్లి, జాలిపూడి, మొండికోడు, శ్రీపర్రు గ్రామాల్లో జగనన్న ఇళ్ల కాలనీలకు లెవెలింగ్ పనులు పూర్తి కావచ్చాయని అధికారులు చెప్పగా, మాదేపల్లిలో 21 ఎకరాల భూమి కేటాయించగా, నేటికి స్థలాలు మార్కింగ్ కాలేదని, ఎన్నికల కోడ్ వస్తే పరిస్థితి ఏమిటని ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీశారు. పోణంగి పంత ద్వారా 500 క్యూసెక్కుల తాగునీరు ఏ మూలకు సరిపోతుందని ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. ఆరోగ్యశాఖకు సంబంధించి డాక్టర్ ఆనంద్ ప్రగతి నివేదిక సమర్పించారు. ఎంపీడీవో బండి ప్రణవి మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా, ఏఎఎన్‌ఎంలు ఫోన్ చేసినా స్పందించడం లేదని డాక్టర్ ఆనంద్‌ను ప్రశ్నించారు. అనంతరం రెవెన్యూ, ఇతరశాఖలకు సంబంధించి ప్రగతిని నివేదించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీ మండల సరస్వతి, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

ఏలూరు క్రైం, జనవరి 27 : రహదారి ప్రమాదాల బారిన పడి ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారని, వీరిలో 67 శాతం మంది 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువత ఉండడం ఆందోళన కలిగించే అంశమని మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.రామగోపాల్ శనివారం తెలిపారు. కేంద్ర క్రైం బ్యూరో లెక్కల ప్రకారం 2021లో దేశవ్యాప్తంగా 4,12,438 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 1,54,972 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2023లో 4,61,312 ప్రమాదాలు సంభవించగా, లక్షా 68 వేల 491 మంది మరణించారన్న, ఏటా పన్నెండు శాతం మేర ప్రమాదాలు, పది శాతం మరణాలు పెరుగుతున్నాయన్నారు. జీడీపీ 3.14 శాతం మేర తగ్గుతున్నదని గణాంకాలు తెలుపుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై వారోత్సవాలు, మాసోత్సవాల్లోనే కాకుండా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

## పంటల స్థితిగతులపై రైతు భరోసా శిక్షణ కార్యక్రమం

ఏలూరుసిటీ, జనవరి 27: పంటల స్థితి గతులు, చీడపీడల పరిస్థితులను, పలు పంటల విస్తీర్ణములపై రైతు శిక్షణా సందర్శన కార్యక్రమాన్ని శనివారం జిల్లా వ్యవసాయ శాఖాధికారి వారి కార్యాలయంలో నిర్వహించారు. విజయరాయి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మోహనరావు (ప్రిన్సిపల్ సెంటిస్ట్, వెంటమాలజీ) అధ్యతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆరు సబ్ డివిజన్లకు చెందిన సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు. జిల్లాలో సాగు చేస్తున్న పలు పంటల గురించి శాస్త్రవేత్త డాక్టర్ మోహనరావు తెలియజేశారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ టి.సుజాత మామిడిలో పూత కావటానికి అట్రిల్ పిచికారీ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం కీటకవిభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కె.ఫణికుమార్, డాక్టర్ ఛాముండేశ్వరి, ఎన్.నాగేంద్ర, ఏరువాక కేంద్రం అధికారులు, వ్యవసాయ శాఖాధికారులు మాట్లాడారు.

## '4న విజయవాడ మహాసభకు తరలిరావాలి'

భీమడోలు, జనవరి 27 : విజయవాడలో ఫిబ్రవరి 4న జరిగే గ్రామీణ వైద్యుల మహాసభ, క్యాన్సర్‌పై అవగాహన సదస్సుకు పీఎంపీ సభ్యులు హాజరు కావాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లోజ్ జయరామ్ సూచించారు. భీమడోలు గ్రామంలో మండల యూనిట్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. మండల కన్వీనర్ రంజాన్‌వలీ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలోని కామినేని హాస్పటల్ నుంచి ర్యాలీగా అనుమోలు గార్డెన్‌కు బయలుదేరి ఆ ప్రాంతంలో నిర్వహించే మహాసభకు సభ్యులందరూ హాజరు కావాలన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. సభ్యులు వెంకట్రావు, ఎస్.ఉమాశంకర్, నాగరాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ స్పెల్‌బీకి జంగారెడ్డిగూడెం విద్యార్థులు

జంగారెడ్డిగూడెం, జనవరి 27 : గ్లోబల్ ఇండియన్ కౌన్సిల్ నిర్వహించిన ఇంటర్నేషనల్ స్పెల్‌బీ కాంపిటీషన్‌లో నేషనల్ రౌండ్‌లో ఉత్తీర్ణత సాధించి ఇంటర్నేషనల్ స్థాయి ఫైనల్స్‌కు జంగారెడ్డిగూడెం ప్రతిభ విద్యార్థులు అర్హత సాధించారు. అమెరికాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పోటీపడి ఆన్‌లైన్‌లో జరిగిన ఫైనల్స్‌లో ముగ్గురు విద్యార్థులు బహుమతులు సాధించారు. స్కూల్‌ల్లో టి.మానసజాయ్(7వ), పి.శ్రీరాజ్ (5వ) ద్వితీయ స్థానాన్ని సాధించి 150 అమెరికన్ డాలర్లను దక్కించుకున్నారు. జె.జశ్వంత్(పదోవ) వంద అమెరికన్ డాలర్లను సాధించినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసరోజారెడ్డి తెలిపారు.

## నేడు మందలపర్రులో వెంకన్న కల్యాణోత్సవం

నిడమర్రు జనవరి 27 : టీటీడీ వారిచే ఆదివారం మందలపర్రులో వేంకటేశ్వరస్వామి నిత్య కైంకర్యముల కార్యక్రమం నిర్వహిస్తున్నామని టీటీడీ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు గాదిరాజు వెంకటసుబ్బరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు తెలిపారు. తిరుపతి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం సుప్రభాతసేవ, తోమాల, సహస్రనామార్చన, తిరుమంజనసేవ కార్యక్రమం సాయంత్రం స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. కైంకర్యంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు.

## నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెదవేగి, జనవరి 27 : కంటి సంరక్షణ ప్రధానమని, ప్రతి ఒక్కరూ నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, కంటి సంరక్షణ పొందాలని పెదవేగి ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2లో భాగంగా అంకన్నగూడెంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. శిబిరంలో పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి, విజయరాయి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ బ్రహ్మం, సీహెచ్‌వో రోజ్‌మేరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులు నియంత్రించాలి'

జంగారెడ్డిగూడెం, జనవరి 27:ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తే సహించేది లేదని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ నాయకులు జి.మణి హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ జంగారెడ్డిగూడెం టౌన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూళ్ల, మౌలిక వసతులు కల్పనలో భాగంగా జంగారెడ్డి గూడెం ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని, రాబోయే కాలంలో విద్యార్థులందరినీ ఐక్యం చేసి వారి తల్లిదండ్రులతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి బి.యశ్వంత్, షేక్ మాబు సుభాని తదితరులు పాల్గొన్నారు

## టెన్త్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ఏలూరు రూరల్, జనవరి 27: మాదేపల్లి హైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఏలూరుజిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అనువుగా విజయకేతనం పుస్తకాలు ముద్రించామని వాటిని ఉచితంగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు.

## 'వడ్డీలేని రుణాలివ్వడం శుభపరిణామం'

ఏలూరు రూరల్, జనవరి 27: కిద్‌మత్ సొసైటీ ద్వారా ప్రజలకు వడ్డీరహిత రుణాలు ఇవ్వడం శుభపరిణామమని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. స్థానిక తంగెళ్ళమూడి ఎస్.ఎస్.వి.ఎల్ ప్లాజాలో కిద్‌మత్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ థ్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ నూతన బ్రాంచిని ఆయన ప్రారంభించారు. తంగెళ్ళమూడిలోని నెహర్ మసీదులో కార్యక్రమ సభావేదిక నిర్వహించారు. జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్‌రఫిక్ మాట్లాడుతూ సౌత్ ఇండియాలో 43 బ్రాంచిలు ఉన్నాయని, ఏలూరులో 13వ బ్రాంచిని ప్రారంభించామన్నారు. సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ నయీముల్లా, సయ్యద్ బాజీద్, డైరెక్టర్లు ఎం.డి. మున్వర్, ఎండి సాదుతుల్లా, ఎండి చాంద్, మేనేజరు షేక్ రబ్బానీ పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ప్రతిభ పురస్కారాలు


రామకృష్ణకు అవార్డు అందిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ

ఏలూరు రూరల్, జనవరి 27: విద్యుత్‌శాఖలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. తురగా రామకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా అవార్డు లభించింది. ఈ అవార్డును ఆశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణకు పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఈఈ భాస్కరరావు, డిప్యూటీ కమిషనర్ రాధ

## అత్యుత్తమ సేవలకు పురస్కారాలు

ఏలూరుటూటౌన్, జనవరి 27: పురప్రజలకు అత్యుత్తమ సేవలు అందించినందుకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు, డిప్యూటీ కమిషనర్ రాధలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

## వీరయ్య మృతికి సంతాపం

ఏలూరు కల్చరల్, జనవరి 27: ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సెలాకోటి వీరయ్య మృతి కళారంగానికి తీరనిలోటని పలువురు సంతాపాన్ని తెలిపారు. పేద కళాకారులకు ఎనలేని సేవలు అందించిన గొప్పవ్యక్తి అని ఆయన మృతి బాధాకరమని సంఘం రాష్ట్రకార్యదర్శి దువ్వి రామారావు, కోశాధికారి హేమసుందర్, పలు జిల్లాల అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, టి.మాధవరావు, వి.బాబులు, పలు మండలాల నాయకులు, కళాకారులు నివాళులర్పించారు.

## శ్రీవారి సేవలో ఏపీ ఎస్‌పీఎఫ్ ఐజీ


ద్వారకాతిరుమలలో పూజలు జరుపుతున్న ఏపీ ఎస్‌పీఎఫ్ ఐజీ రామిరెడ్డి

ద్వారకాతిరుమల/ జంగారెడ్డిగూడెం, జనవరి 27: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని, జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని ఏపీ ఎస్‌పీఎఫ్ ఐజీ జీవీ రామిరెడ్డి, సీఐడీ విభాగం డీఎస్పీ శివారెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. ద్వారకాతిరుమలలో ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా ఘనస్వాగతం పలికారు. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖమండపంలో అర్చకుల నుంచి వేదాశీర్వచనం అధికారుల నుంచి శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలను పొందారు. మద్దిలో ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు. స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

## సీట్ల మార్పిడి వైసీపీకి చేటు

ద్వారకాతిరుమల, జనవరి 27: సర్వేల పేరుతో గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పిడి కారణంగా వైసీపీ ఆయా సీట్లు కోల్పోయే పరిస్థితి ఉందని తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డ్ చైర్మన్ ముప్పిడి సంపత్ వాఖ్యానించారు. కొవ్వూరులో తలారి వెంకట్రావు, గోపాలపురంలో తానేటి వనితలను మార్చి పార్టీలో కష్టబడి పనిచేసేవారికి సీటు ఇవ్వాలని కోరారు. ద్వారకా తిరుమల శ్రీవారిని దర్శించిన తర్వాత ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వేల పేరుతో సీట్లు మార్పుచేయడం వల్ల కార్యకర్తలు అయోమయంలో పడ్డారన్నారు.

## వెల్లమిల్లి క్షేత్రంలో ప్రజా రవాణా అధికారుల పరిశీలన

ఉంగుటూరు, జనవరి 27 : రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసేందుకు ప్రజా రవాణా సంస్థ ద్వారా కార్గో సేవలను ఏవిధంగా ఉపయోగించుకోవాలో అనే విషయమై శనివారం పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. వెల్లమిల్లి గ్రామంలోని పొలాలను పరిశీలించారు. దీనిలో భాగంగా ఉంగుటూరు లేదా నారాయణపురం సెంటర్లలో తమకు అవకాశం కల్పించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి రాఘవులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. క్షేత్ర పరిశీలనలో రైతు పరిమి సత్యనారాయణ, రాజేంద్ర నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం, జనవరి 27 : ఉమ్మడి గుంటూరు జిల్లా గురజాడలో ఫిబ్రవరి 3,4 తేదీల్లో నిర్వహించే ఏఐకేఎంఎస్ (చంద్రన్న వర్గం) పదో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ప్రకాశ్ తెలిపారు. శనివారం కోపల్లెలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. మహాసభల్లో ప్రజాసమస్యలను చర్చించి కార్యచరణ రూపొందిస్తా మన్నారు. నాయకులు సున్నం సోమరాజు, వేట్ల బాబుల్‌రెడ్డి, కలింపూడి సుందరరావు, సముద్రాల బాలసుందరం, బోడ ఏసు, సాలి రాజశేఖర్ పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమ్మె ఉద్యోగ సంఘాలకు ఆదర్శం

టి.నరసాపురం, జనవరి 27 : అంగన్వాడీల సమ్మె ఉద్యోగ సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని యూటీఎఫ్ మండలం అధ్యక్షుడు లక్ష్మణరావు తెలిపారు. టినరసాపురంలో అంగన్వాడీల విజయోత్సవ సభ పి.ఫణివర్ధిని అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు42 రోజులు ఐక్యంగా సమ్మె చేసి విజయం సాధించారన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఎం.సత్యవతి, బాబి, సరోజిని, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధిత కుటుంబానికి 'చేయూత' సాయం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న చేయూత సభ్యులు

పెదవేగి, జనవరి 27 : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి చేయూత సంస్థ ఆసరాగా నిలిచింది. నిత్యావసరాలతోపాటు ఆర్థికసాయం అందించింది. గార్లమడుగు పంచాయతీ వెంకటకృష్ణాపురానికి చెందిన గొటుకుల పార్థసారథికి చెందిన తాటాకిల్లు గతనెల 20న గ్యాస్ లీకేజీ ప్రమాదంలో అగ్నికి ఆహుతైంది. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో ఇంటిని నిర్మించుకునే ఆర్థికస్తోమత లేక అదే ఇంటిపక్కన ఓ చెట్టుకింద ఆ కుటుంబం తలదాచుకుంటోంది. పార్థసారథికి వృద్ధురాలైన తల్లి, భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారి దీనస్థితిని గుర్తించి చేయూత సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, 50 కిలోల బియ్యం, రూ.పదివేలు నగదు అందించారు. చేయూత సంస్థ సభ్యులు మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, మరీదు లక్ష్మణరావు, వి.రాజేంద్ర, ఐ.శరత్‌బాబు, మోర్ల హేమసుందర్, జి.ప్రసాద్, సీహెచ్.నాగేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, రాజులపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

లింగపాలెం, జనవరి 27: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఆశీర్వాదం, డాక్టర్ కృష్ణకిషోర్ సూచించారు. ఆసన్నగూడెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ హర్ష, డాక్టర్ తౌషిబ్ గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామస్థులకు ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు మందులను అందజేశారు. ఈవోపీఆర్‌డీ జె.ఎమ్ రత్నకుమార్, ఆరోగ్యవిస్తరణ అధికారి అబ్రార్ హుస్సేన్, దివ్య, ఉమామహేశ్వరరావు, వైద్యసిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ఏలూరుటూటౌన్, జనవరి 27: ఉపాధి హామీ వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో శనివారం జీవరత్నం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆన మాట్లాడుతూ ఉపాధిహామీలో ఫేస్‌యాప్ రద్దు చేయాలన్నారు. ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసిందన్నారు. పది వారాల నుంచి కూలీలకు వేతనాలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, ముత్యాలమ్మ, నాగేంద్రరావు, మహంకాళి, సుధారాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.


రావిచర్ల గ్రామంలో పాత, కొత్త సర్వేరాళ్ళ మధ్య తేడా

# రీ సర్వేతో భూ విస్తీర్ణంలో కోత

» పాత సర్వేప్రకారమే భూములను ఉంచాలంటున్న రైతులు

నూజివీడు టౌన్, జనవరి 27: నూజివీడు మండలం రావిచర్ల భూ సర్వేలో అనేక అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగనన్న భూరక్ష పథకంలో భాగంగా గ్రామంలో సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో దాదాపు 400 ఎకరాల భూమి ఎక్కువగా ఉన్నట్లుగా అధికారులు, సర్వే సిబ్బంది చూపుతున్నారు. గ్రామంలో మొత్తం 2,900 ఎకరాలు ఉండగా, రీసర్వే అనంతరం 3,300 ఎకరాల భూమి ఉన్నట్లుగా అధికారులు చెప్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేవల్ల గతంలో ఉన్న తమ భూమిలో కొంత భాగాన్ని కోల్పోవాల్సి వస్తోందని, దీంతో రైతులమధ్య గొడవలకు కారణమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్న, మొన్నటివరకు కలిసికట్టుగా ఉన్న రైతులు ఈ జగనన్న రీసర్వే పుణ్యమా అని ఎవరికి వారే యమునా తీరు అనేలా పక్కవారితో కనీసం మాటలు కూడా కలపని పరిస్థితి ఏర్పడుతోందని, గత సర్వేలెక్కల ప్రకారమే తమకు భూములను చూపాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్ళస్థలాలు, పొలాల్లో కూడా కొంతభూమిని రైతులు కోల్పోవాల్సిన పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించాలని తక్షణం సర్వే పనులు నిలిపివేసి తమకు న్యాయం చేయాలని అధికారులను, రైతులు కోరుతున్నారు.

## ముసునూరు ఎస్ఐగా వాసు బాధ్యతలు



ముసునూరు, జనవరి 27: ముసునూరు మండల నూతన ఎస్ఐగా పి.వాసు శనివారం బాధ్యతలను స్వీకరించారు. సాధరణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఎం.కుటుంబరావు చింతలపూడి బదిలీ అయ్యారు. కాకినాడ రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న వాసు ముసునూరుకు బదిలీపై వచ్చారు. నూతన ఎస్ఐగా బాధ్యతలను స్వీకరించిన వాసుకు ఏఎస్ఐ నాగభూషణరావు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ అజయ్‌కుమార్, భాగ్యాలరావుతోపాటు సిబ్బంది అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ వాసు తెలిపారు.

## కైకలూరు రూరల్ ఎస్ఐగా రామకృష్ణ



కైకలూరు, జనవరి 27: కైకలూరు రూరల్ ఎస్సైగా తలారి రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని నూజివీడు రూరల్ నుంచి రామకృష్ణ కైకలూరుకు బదిలీ అయ్యారు. కైకలూరు రూరల్ ఎస్ఐగా పనిచేసిన జ్యోతిబసు బదిలీపై జంగారెడ్డిగూడెం వెళ్లారు.

## ముదినేపల్లి ఎంపీడీవో బదిలీ

ముదినేపల్లి, జనవరి 27 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముదినేపల్లి ఎంపీడీవో పి.మల్లీశ్వరి బదిలీ అయ్యారు. అయితే పూర్వపు కృష్ణా జిల్లా ప్రాతిపదికన బదిలీలు నిర్వహించటంతో ఆమెను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ముదినేపల్లి మండలం ప్రస్తుతం ఏలూరు జిల్లాలో ఉండగా, ఆమెను కృష్ణా జిల్లాకు బదిలీ చేసే అవకాశం ఉంది.

## వెంకయ్యనాయుడుకి మాగంటి అభినందన



కైకలూరు, జనవరి 27: పద్మవిభూషణ్ పురస్కారం వరించిన మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడును శనివారం హైదరాబాదులో ఆయన స్వగృహంలో మాజీ ఎంపీ మాగంటి బాబు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ తెలుగుజాతి ఖ్యాతిని వ్యాపింపజేసిన ప్రముఖుల్లో వెంకయ్యనాయుడు ప్రముఖపాత్ర పోషించారని, ఆయన మరిన్ని పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు.

## లోకేశ్‌ను కలసిన కైకలూరు టీడీపీ నేత



కైకలూరు, జనవరి 27: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కైకలూరు టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం గన్నవరం విమానాశ్రయంలో లోకేశ్‌ను కలసి కొద్దిసేపు కైకలూరు రాజకీయాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో కైకలూరులో టీడీపీ విజయ కేతనం ఎగురవేసేలా పార్టీని మరింత బలోపేతం చేయాలని, త్వరలోనే కైక లూరు అభ్యర్థిత్వాలపై చర్చిద్దామని ఆయన తెలిపినట్లు వెంకటేశ్వరరాజు తెలిపారు.

## ఆగిరిపల్లిలో కార్యాలయం ప్రారంభించిన చిన్నం

ఆగిరిపల్లి, జనవరి 27: నూజివీడు నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న చిన్నం రామకోటయ్య శనివారం ఆగిరిపల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభించారు. తన మద్దతుదారులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేవని, నాయకుల దోపిడీకి ప్రజలు గురవుతున్నారని అన్నారు.

### క్రైం కార్నర్

## నాటు తుపాకుల సప్లయర్ అరెస్టు



ముదినేపల్లి, జనవరి 27 : ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామంలోని ఆళ్ల వీరాంజనేయులు చేపల చెరువుపై ఇటీవల నాటు తుపాకీ మందు పేలి ఒక వ్యక్తి మృతి చెందటం, మరో వ్యక్తికి తీవ్ర గాయాలకు గురైన ఘటనలో నిందితుడైన తమిళనాడుకు చెందిన సతీష్‌ను శనివారం సీఐ కృష్ణ కుమార్ అరెస్టు చేశారు. తుపాకీ మందు పేలి అసోంకు చెందిన రిటూ బరో మరణించగా, బికాస్ బరో తీవ్ర గాయాలకు గురైన విషయం విదితమే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారికి తుపాకీలు ఇచ్చిన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా నాయక్‌పూర్‌కు చెందిన సతీష్‌ను అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపర్చగా, మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ కృష్ణ కుమార్ ఆక్వా రైతులతో సమావేశం నిర్వహించి నాటు తుపాకులు వినియోగించటం నేరమని, లైసెన్సులు లేకుండా తుపాకులు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వ్యాన్ ఢీకొని మోటారు మెకానిక్ మృతి

ఆకివీడు, జనవరి 27: బొలెరా వాహనం ఢీకొని మోటారు సైకిల్ మెకానిక్ మృతి చెందాడు. ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతంలో ఉంటున్న నడింపల్లి సాయిచందు (25) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. శనివారం షాపునకు వెళుతుండగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆకివీడు నుంచి అయి-భీమవరం వైపు వెళ్తున్న బొలెరా వేగంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి సిద్దూ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగబాబు కేసు నమోదు చేశారు. హెల్మెట్ ధరించి ఉంటే మరణించేవాడు కాదని ఎస్ఐ అన్నారు. హెల్మెట్లు ధరిస్తే కుటుంబాలు రోడ్డున పడవన్నారు. సంతాప సూచికంగా మెకానిక్ దుకాణాలు మూసివేశారు.

## అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ముదినేపల్లి, జనవవరి 27 : ముదినేపల్లి మండలం పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెం గ్రామానికి చెందిన కాగిత నాగమణి అనే ఒంటరి మహిళ పట్ల అదే గ్రామానికి చెందిన కలిదిండి దుర్గారావు అనే వ్యక్తి ఈ నెల 25 రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.


ఉప్పరగూడెం వద్ద బంటుమిల్లి రోడ్డు మలుపును మూసేసిన ముళ్ల చెట్లు

# మలుపుల్లో ముళ్ల పొదలు

» మూసుకుపోయిన రహదారులు
» వాహనదారుల గగ్గోలు..
» పట్టించుకోని అధికారులు

**ముదినేపల్లి మండలంలోని పలు ప్రధాన రహదారులు ముళ్ల చెట్లతో మూసుకుపోయి ప్రమాదకరంగా పరిణమించాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. రోడ్ల మలుపుల్లో పెరిగిన ముళ్ల పొదలు మరింత ప్రమాదకరంగా మారాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు తమ కేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.**

ముదినేపల్లి, జనవరి 27: సింగరాయపాలెం నుంచి కొత్తపల్లి వరకు ప్రతి మలుపు ప్రమాదకరంగానే ఉంది. ఒక వైపు నుంచి వచ్చే వాహనాలు మరో వైపు నుంచి వచ్చే వారికి కనిపించక ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఉప్పరగూడెం వద్ద మలుపులు అతి ప్రమాదకరంగా ఉన్నాయి. ఒక్కో చోట రెండు వాహనాలు తప్పుకునే పరిస్థితి కూడా లేదు. ముళ్లచెట్లు భారీగా పెరిగి రోడ్లపైకి చొచ్చుకొస్తున్నాయి. కోమర్రు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్నాయి. విశ్వనాద్రిపాలెం - పెదగొన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో విద్యార్థులు సైకిళ్లపై వెళ్లటం ఇబ్బందిగా ఉంది. కొరగుంటపాలెం, రాజానగరం, గోకినంపాడు గ్రామాల వద్ద రోడ్ల మార్జిన్లు ముళ్లచెట్లతో నిండాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వాటి తొలగింపు చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### బీసీలను ఊచకోత కోసిన

# వైసీపీకి ఓట్లడిగే అర్హత లేదు

» ముద్దరబోయిన, గన్ని ధ్వజం
» నూజివీడులో జయహో బీసీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నూజివీడు, జనవరి 27: బీసీలను ఊచకోత కోసిన వైసీపీకి ఓట్లు అడిగే అర్హత లేదని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. నూజివీడు పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలను వేధించిన వైసీపీ నేతలను ప్రశ్నించినందుకు 74 మంది అమాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు. దాదాపు 5 వేల మందిని దారుణంగా హింసించి అణగదొక్కే ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసిన 14 లక్షల ఎకరాలు కబ్జా చేసేందుకు అధికార పార్టీ నాయకులు యోచిస్తున్నారన్నారు. బీసీ సబ్ ప్లాన్ కింద విడుదల చేసిన రూ. 76,750 కోట్ల నిధులను వైసీపీ పక్కదారి పట్టించిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లను తగ్గించిందన్నారు. టీడీపీ హయాంలో 37 లక్షల మంది బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి, ఆదరణ పథకం కింద రూ.1130కోట్లతో చేతివృత్తుల వారి అభివృద్ధికి కృషి చేశామన్నారు. వైసీపీ పాలనలో, టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని, సమయం, తేదీ మీరే చెప్పాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు జి.రమేష్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, జనసేన నాయకుడు శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు వాకా రాజ్‌కుమార్, కందిపల్లి చెన్నారావు, గొల్లు దుర్గాదేవి, ఎదురేసి అచ్చిమాంబ, కౌన్సిలర్లు కొమ్మని విజయ, తిరుమలశెట్టి సాధనా స్రవంతి, దాసరి స్వామి, యార్లగడ్డ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే బంగారు భవిత


మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయకుమార్

మండవల్లి, జనవరి 27: క్రమశిక్షణ, ఉత్తమ వ్యక్తిత్వం విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మండవల్లి జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ అధ్యక్షతన టెన్త్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విజయకుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ టెన్త్ తర్వాత ఉన్నత విద్యలో విద్యార్థి సబ్జెక్టుల ఎంపిక, కోర్సులు తీసుకునే నిర్ణయమే భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఆలోచించి అడుగు వేయాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తమ తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు కోరారు. మండవల్లి మండల ఐక్యవేదిక కన్వీనర్ టి. అప్పారావు, హెచ్ఎం ప్రసాద్, జొన్నలగడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ టెస్ట్ పేపర్ల వితరణ

ముసునూరు, జనవరి 27: టెన్త్ విద్యార్థులు కష్టపడి చదివి మంచి గ్రేడ్ మార్కులు సాధించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ సోషల్ ఉపాధ్యాయుల సహకారంతో రూపొందించిన మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలను శనివారం ముసునూరు జడ్పీ హైస్కూలులో టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు కాసాని గాంగేయుడు, జి.పద్మకిషోర్, సీహెచ్.జాకబ్‌రాజు, ఏ.రాజశేఖర్‌రావు, ఎం.ఫ్రాన్సిస్, డి.రత్నమాల, పి.వి.రమణ, హెచ్ఎం ఏ.సునీల తదితరులు పాల్గొన్నారు.

## మానవత దుప్పట్ల వితరణ



కలిదిండి, జనవరి 27 : కలిదిండిలో శనివారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో 400 మంది పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ చలికాలంలో పేద వృద్ధులకు మానవత సేవలు అభినందనీయమన్నారు. కలిదిండి మానవత అధ్యక్షుడు గోదావరి సత్యనారాయణ, చైర్మన్ పేటేటి వివేకానంద, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సొసైటీ చైర్మన్ వడుపు రామారావు, సర్పంచ్ మారుతి ప్రసన్న, ఎంపీటీసీలు నీలి సుమన్, చాన్ బాషా పాల్గొన్నారు.

## పోలీసు బందోబస్తు మధ్య రోడ్డు నిర్మాణం

ముదినేపల్లి, జనవరి 27 : ముదినేపల్లి మండలం కొరగుంటపాలెంలో నిర్మిస్తున్న అంతర్గత రహదారికి ఆటంకంగా ఉన్న ఆక్రమణల తొలగింపుపై వివాదం తలెత్తింది. శనివారం ఆ గ్రామంలో పంచాయతీ అధికారులు చేపట్టిన రోడ్డు నిర్మాణానికి నాయుడు వెంకటేశ్వరరావు కుటుంబం అభ్యంతరం తెలపడంతో రెవెన్యూ, పోలీసు అధికారులు రంగంలోకి దిగారు. వెంకటేశ్వరరావు, అతని కుటుంబీకులు తమ నిర్మాణాలను తొలగించేందుకు ఒప్పుకోలేదు. మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రభుకుమార్ తదితరులు నచ్చ చెప్పినా వారు ససేమిరా అనడంతో ఎస్ఐ వెంకట్ కుమార్ వెళ్లి రోడ్డు నిర్మాణాన్ని పోలీసు బందోబస్తుతో తొలగించారు. అధికారులు రోడ్డు నిర్మాణం చేపట్టారు.

## ఈ ఏడాది నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు

ఏలూరు క్రైం, జనవరి 27 : కేసుల పరిష్కారంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోర్టు రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచిందని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి రామగోపాల్ చెప్పారు. 2024వ సంవత్సరంలో జాతీయ లోక్ అదాలత్‌ల నిర్వహణపై స్థానిక న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారిలతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ ఏడాది మార్చి 9, మే 11, సెప్టెంబరు 14, డిసెంబరు 14 తేదీల్లో జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని చెప్పారు.


మైక్రో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కామినేని

## కొల్లేరు ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం

» రాజధాని లేని రాష్ట్రం మనదే » మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్
» తన విరాళం 18 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్ ప్రారంభం

మండవల్లి, జనవరి 27: కొల్లేటి ప్రజల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, కాంటూరు కుదింపు వ్యవహారంలో అందరూ కలసికట్టుగా పోరాటం చేద్దామని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండవల్లి మండలం పెనుమాకలంకలో డాక్టర్ కామినేని అందించిన సుమారు రూ.18 లక్షలతో నెలకొల్పిన మినరల్ మైక్రో వాటర్ ప్లాంట్‌ను శనివారం కామినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కామినేని మాట్లాడుతూ కొల్లేరు పరిధిని 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజధాని లేని రాష్ట్రం మనదేనని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కరెంటు బిల్లులు మోత మోగిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో తీవ్రస్థాయిలో అరాచకాలు పెరిగిపోయాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో దుర్మార్గ పాలన చేస్తున్న నాయకులను ఇంటికి పంపాలన్నారు. రాష్ట్ర వడ్డి సాధికార సంఘం అధ్యక్షుడు బలే ఏసురాజు, పెనెమాకలంక సర్పంచ్ నాగరాజు, గ్రామపెద్దలు జయమంగళ సుబ్బరాజు, ముంగర కొండ, టీడీపీ మండవల్లి మండల అధ్యక్షుడు నారగాని వెంకటేశ్వరరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న వీరమల్లు, వీరశివాజీ

## ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

కైకలూరు, జనవరి 27: ప్రైవేటు ఎలక్ట్రీషియన్లంతా సమైక్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు అన్నారు. థామస్ ఆల్వా ఎడిసన్ ఎలక్ట్రిక్ బల్బును కనిపెట్టిన రోజును పురస్కరించుకుని శనివారం కైకలూరులో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లంతా ఎలక్ట్రీషియన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించి గాంధీ బొమ్మ సెంటర్లో కేక్ కట్ చేసి జెండా ఎగురవేశారు. బీసీ నాయకులు లావేటి వీరశివాజీ, ఎలక్ట్రీషియన్స్ యూనియన్ నాయకులు పోలగాని నాగరాజు, దాసరి శ్రీహరి, పిచుకల శ్యామలరావు, మునగాల కుమార్, షఫీ, ఇర్ఫాన్, పవన్‌కుమార్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.


మాదిగల మేలుకొలుపు సభలో మాట్లాడుతున్న దండు వీరన్న

## ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు సహకరించాలి

ముదినేపల్లి, జనవరి 27 : ఎస్సీ వర్గీకరణకు అన్ని పార్టీలు సహకరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరన్న అన్నారు. శనివారం ముదినేపల్లి మండల కన్వీనర్ పరిసిపోగు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన మాదిగల మేలుకొలుపు బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకే మాదిగ సామాజిక వర్గం అండగా ఉంటుందన్నారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ సబ్ ప్లాన్‌ను పదేళ్లపాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు, ప్రధాన కార్యదర్శి కోవూరు సుధాకర్, నాయకులు పాలపర్తి సద్గుణరావు మాదిగ, కంచర్ల సుధాకర్, ఉదయగిరి కృష్ణారావు, గోనా దావీదు, కటికల ప్రభుదాసు, జుజ్జవరపు ప్రశాంతి పాల్గొన్నారు.

# 46 మంది ముస్లిం యువత రక్తదానం


కైకలూరు ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువత

కైకలూరు, జనవరి 27: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ముస్లిం యువత రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని జామియా మసీద్ కమిటీ ప్రెసిడెంట్ ఎండీ జిలానీ బాషా అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కైకలూరులో శనివారం ముస్లిం యువత (ఈద్గా కమిటీ), కైకలూరు ప్రభుత్వాసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 46 మంది యువత రక్తదానం చేశారు. అలాగే రోగులకు బీపీ, షుగరు పరీక్షలు చేసి ఉచితంగా చూసి మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని షేక్ ఇస్మాయిల్ ప్రారంభించారు. కమిటీ సభ్యులు ఎండీ జహీర్, ఇలా ఉల్ హక్, ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ గఫూర్‌ఖాన్, సెక్రటరీ అమీర్, మహ్మద్ జానీ, సయ్యద్ బాషీద్, ఎండీ ఉస్మాన్, షేక్ షరీఫ్, మూసా, ఎండీ గాలిబ్, ఎండీ రఫీబాషా, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులకు పార్థసారథి ఫోన్లు?

చాట్రాయి, జనవరి 27: పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న కొలుసు పార్థసారథి మండలంలోని నాయకులకు శుక్రవారం రాత్రి ఫోన్లు చేసి మాట్లాడటం చర్చనీయాంశం అయ్యింది. మండలంలో వివిధ గ్రామాల్లో టీడీపీ ముఖ్య నాయకులతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినప్పుడు తనతో పరిచయాలు ఉన్న నాయకులకు కూడా సారథి ఫోన్లు చేసి తన గెలుపుకు సహకరించాలని కోరినట్లు సమాచారం. దీనికితోడు ఆంధ్రజ్యోతిలో శనివారం 'ఫిబ్రవరిలో టీడీపీలోకి పార్థసారథి' శీర్షికన ప్రచురితమైన కథనం అన్ని పార్టీల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## అట్రాసిటీ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నూజివీడు, జనవరి 27: నూజివీడు ఇంటిగ్రేటెడ్ బాయిస్ హాస్టల్లో సీఐడీ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐడీ సీఐ కె.శ్రీనివాస్ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, పీఓఏ యాక్ట్ 1989లోని సెక్షన్లు, వాటి వినియోగాన్ని వివరించారు. చట్టాన్ని దుర్వినియోగం అవ్వకుండా బాధితులకు న్యాయం జరిగేలా చూడటం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. నూజివీడు రూరల్ సీఐ బాలసురేష్, నూజివీడు ఏఎస్‌డబ్ల్యూవో డి.శ్రీనివాసరావు, సీఐడీ ఎస్సై బాలాజీ, నూజివీడు ఏఎస్సై సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## 'ఆడుదాం ఆంధ్రా'లో అన్యాయం

» సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట క్రీడాకారుల ఆందోళన

నూజివీడు టౌన్, జనవరి 27: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌లో తమకు అన్యాయం చేశారంటూ క్రీడాకారులు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ నియోజకవర్గ ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నూజివీడు మండలం దిగవల్లి గ్రామంలో నిర్వహించారని, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల మధ్య ఫైనల్స్ నిర్వహించగా అంపైర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమకు అన్యాయం చేశాడని, ఆగిరిపల్లి మండలం క్రికెట్ టీమ్ సభ్యుడు రమేష్ ఆరోపించారు. తిరిగి మ్యాచ్‌లు నిర్వహించి, తమకు న్యాయం చేయాలని, పిచ్‌ను కూడా మార్చాలని క్రీడాకారులు డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితులను తక్షణం ఆదుకోండి


మాట్లాడుతున్న ఎంవీఐ నాగ మురళి

నూజివీడు టౌన్, జనవరి 27: రహదారి భద్రత మనందరి బాధ్యతని, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసేవలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నూజివీడు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగమురళీ అన్నారు. నూజివీడు ఎంవీఐ కార్యాలయంలో 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రహదారి భద్రత మనందరి బాధ్యత అనే అంశం పై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్టులను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైలవరం బెస్ట్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జమలయ్య మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డుపక్కన ఉండే గుర్తులను మార్కింగ్స్‌ను పాటించి జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ నియోజకవర్గ విన్నర్ ఈదర జట్టు

## కబడ్డీ విజేత నూజివీడు .. వాలీబాల్ విజేత ఈదర

నూజివీడు టౌన్, జనవరి 27: ఆడుదాం ఆంధ్రా నూజివీడు నియోజకవర్గ పోటీల్లో భాగంగా శనివారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. కబడ్డీ ఫైనల్లో నూజివీడు ప్రథమ స్థానం సాధించగా, చాట్రాయి ద్వితీయస్థానం, వాలీబాల్లో ఆగిరిపల్లి ప్రథమ, నూజివీడు ద్వితీయ, పురుషుల ఖోఖో పోటీల్లో ముసునూరు ప్రథమ, ఆగిరిపల్లి ద్వితీయ, బ్యాడ్మింటన్ పోటీల్లో చాట్రాయి ప్రథమ, ఆగిరిపల్లి ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఇక మహిళా కబడ్డీలో చాట్రాయి ప్రథమ, ఆగిరిపల్లి ద్వితీయ స్థానంలోనూ, ఖోఖోలో చాట్రాయి ప్రథమ, నూజివీడు ద్వితీయ స్థానంలోనూ, వాలీబాల్లో ముసునూరు ప్రథమ స్థానం, నూజివీడు ద్వితీయ స్థానంలోనూ నిలిచాయి. నూజివీడు, ముసునూరు మండల ఎంపీడీవోలు జి.రాణి, ఎం.విజయ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు స్వప్న, హారతి, వనజ, రాజేంద్రప్రసాద్, రవీంద్ర, రాజ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

## 8 చోట్ల ఇంకుడు గుంతల నిర్మాణం



చాట్రాయి, జనవరి 27: భూగర్భ జలాలు పెంచాలనే లక్ష్యంతో ఉపాధి పథకం నిధులతో పలు గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో 8 ఇంకుడు గుంతలను నిర్మించారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ పేరుతో ఒక్కో ఇంకుడు గుంతను రూ. 50 వేలతో నిర్మించారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయం, తుమ్మగూడెం, కొత్తగూడెం, పోతనపల్లి, కోటపాడు, చీపురుగూడెం గ్రామ సచివాలయాల్లో, నరసింహారావుపాలెం ఆర్బీకేలో, చిన్నంపేట జడ్పీ హైస్కూల్‌లో వీటిని నిర్మించారు. వర్షం నీటిని, మురుగు నీటిని ఇంకుడు గుంతలోకి మళ్ళించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడ పడ్డ వాన చినుకుని అక్కడే భూమిలోకి ఇంకేలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి తాగు, సాగు నీటి ఇబ్బందులు తీరతాయని, వ్యవసాయ భూముల్లో, గృహాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తులో నీటి కొరత ఉండదని ఉపాధి ఏపీవో లక్ష్మీకుమారి వివరించారు.